అనంత జిల్లాలో 2,236 మంది బూత్ స్థాయి అధికారులు(బీఎల్‌ఓ) పని చేస్తున్నారు. వారిలో దాదాపు గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగులే. 2020 నుంచి ఇప్పటి దాకా ఒకొక్కరికి రూ.29,500 ప్రోత్సాహకం/బిల్లు రావాలి. ప్రస్తుతం ఎంత ఇస్తారోనని ఎదురుచూస్తున్నారు.

ఉమ్మడి అనంతకు రూ.24.63 కోట్లు

➤ నిధులు మంజూరు చేసిన ఈసీ
➤ బిల్లుల చెల్లింపుపై ఉద్యోగుల్లో ఆశలు



జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ఈ ఏడాది మేలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పని చేసిన అధికారులు, ఉద్యోగులు పెండింగ్ బిల్లుల సొమ్ము వచ్చేసింది. ఇక నిర్దేశిత సిబ్బందికి చెల్లింపులు చేయాల్సి ఉంది. వారికే కాకుండా గుత్తేదారులకు బిల్లులు ఇవ్వాల్సి ఉంది. గతంలో ఎన్నికల జరిగిన రెండుమూడేళ్ల తర్వాత పెండింగ్ బిల్లులు మంజూరు అయ్యేవి. ఎన్నడూ లేనివిధంగా ఈసారి పెండింగ్ బిల్లులు పెట్టిన నాలుగు మాసాలకే ఎన్నికల సంఘం (ఈసీ) నిధులు మంజూరు చేయడం గమనార్హం. రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈఓ వివేక్‌యాదవ్ సిఫార్సు చేసిన వెంటనే తెదేపా కూటమి ప్రభుత్వం రూ.299.37 కోట్లు మంజూరు చేసింది. ఇందులో అనంత జిల్లాకు రూ.17.27 కోట్లు శ్రీసత్యసాయి జిల్లాకు రూ.7.36 కోట్లు కేటాయించారు. సత్వరమే పెండింగ్ బిల్లులు చెల్లించాలని సీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. ఎంత చెల్లిస్తారు.. పెండింగ్ బిల్లు మొత్తం ఇస్తారా.. లేదా? అన్న సందేహాలు ఉద్యోగుల్లో వ్యక్తమవుతున్నాయి.

మూడు మాసాల శ్రమ

రాష్ట్రంలో లోక్‌సభ, శాసనసభ ఎన్నికలు ఏకకాలంలో జరిగిన సంగతి తెలిసిందే. మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు జరిగాయి. మార్చి, ఏప్రిల్ నుంచి జూన్ మొదటి వారం దాకా వేలాది మంది అధికారులు, ఉద్యోగులు ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో పాలుపంచుకున్నారు. ఇందుకు కేడర్ల వారీగా తగిన ప్రోత్సాహకం, గౌరవవేతనం చెల్లించాల్సి ఉంది. పోలింగ్, ఓట్ల లెక్కింపు రోజుల్లో పని చేసిన సిబ్బందికి అక్కడికక్కడే నిర్దేశిత సొమ్ము చెల్లించారు. బీఎల్‌ఓ, నోడల్ అధికారులు, తహసీల్దార్లు, ఆర్‌ఓ కార్యాలయాలు, జిల్లా ఎన్నికల కార్యాలయం, ఇలా అనేక చోట్లా పని చేసిన సిబ్బందికి అరకొర బిల్లు ఇచ్చారు. ఇప్పటికీ చాలా మందికి రూ.వేలల్లోనే బిల్లు చెల్లించాల్సి ఉంది.

'లెక్క'లేని వ్యయం

ఎన్నికల వ్యయం కోసం ఇప్పటికే కొంత నిధులు మంజూరు అయ్యాయి. ఒక్క అనంత జిల్లాకే దాదాపు రూ.14కోట్లుపైగా వచ్చినట్లు తెలుస్తోంది. దీన్ని ఇప్పటికే ఖర్చు పెట్టారు. ఈ క్రమంలో అనంత, రాప్తాడు, శింగనమల, తాడిపత్రి.. తదితర ప్రాంతాల్లో ఎన్నికల ఖర్చులో చేతివాటం ప్రదర్శించారన్న ఆరోపణలు వచ్చాయి. మంజూరైన నిధులు, ఖర్చుకు పొంతన లేదన్న వాదన తెరపైకి వచ్చింది. ఫర్నీచర్, భోజనాలు, తాగునీరు, బ్యాలెట్ సామగ్రి ముద్రణ, బారికేడ్ల నిర్మాణం, వాహనాల అద్దె... ఇలా అనేక రూపాల్లో అద్దె చెల్లించాల్సి ఉంది. రూ.20 కోట్లు దాకా అదనంగా నిధులు కావాలంటూ ఇది వరకే సీఈఓకు నివేదించారు. ఈనేపథ్యంలో వచ్చాయి. డబ్బు రావడంతో గుత్తేదారులు, ఉద్యోగులు పెండింగ్ బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు.

మండలాల్లో వర్షపాతం

రాంనగర్(అనంతపురం), న్యూస్‌టుడే: అనంత జిల్లాలో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జడివాన కురిసింది. రాత్రి పలు మండలాల్లో వర్షం పడింది. బుధవారం రాత్రి వరకు కురిసిన వర్షపాతాన్ని పరిశీలిస్తే.. కంబదూరు మండలంలో 47.4 మి.మీలు అత్యధిక వర్షపాతం నమోదయ్యింది. శెట్టూరులో 40.4, కుందుర్పిలో 38.0, కళ్యాణదుర్గంలో 32.8, యల్లనూరులో 32.0, రాప్తాడులో 31.8, పుట్లూరులో 30.6, ఆత్మకూరులో 29.6, ఉరవకొండ, గుమ్మగట్ట మండలంలో 23.0 మి.మీల చొప్పున, బ్రహ్మసముద్రంలో 21.8, వజ్రకరూరులో 20.8, తాడిపత్రిలో 20.2, నార్పలలో 18.8, గుత్తిలో 18.6, బెళుగుప్పలో 17.4, పామిడిలో 16.4, విడపనకల్లులో 16.2, యాడికిలో 15.4 మి.మీల వర్షం కురిసింది. రాయదుర్గం, పెద్దవడుగూరు, అనంతపురం, శింగనమల, కణేకల్లు, గార్లదిన్నె, కూడేరు, పెద్దపప్పూరు, గుంతకల్లు మండలాల్లో 10 మి.మీలు పైగా కురిసింది. బొమ్మనహాళ్, బుక్కరాయసముద్రం, డి.హిరేహాళ్ మండలాల్లో చిరుజల్లులు పడ్డాయని జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి అశోక్ తెలిపారు.

వాన తగ్గింది..

➠ కల్లాల్లోనే మొలకలు.. కర్షకులకు కన్నీళ్లు
➠ ఉమ్మడి జిల్లాలో దెబ్బతిన్న పంటలు


నష్టం మిగిల్చింది



బొమ్మనహాళ్ పరిధిలో నీట మునిగిన జొన్న

ఈనాడు, అనంతపురం -న్యూస్‌టుడే, పుట్టపర్తి, కణేకల్లు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలహీనపడి వర్షాలు తగ్గినా.. అన్నదాతలకు మాత్రం నష్టాన్ని మిగిల్చింది. రెండు రోజులుగా కురిసిన వానకు ఉమ్మడి అనంత జిల్లాలో సాగు చేసిన పంటలు దెబ్బతిన్నాయి. కోతలు పూర్తిచేసి పొలాల్లో ఉంచిన వేరుసెనగ, కల్లాల్లోని మొక్కజొన్న మొలకెత్తడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వేరుసెనగ కాయలు బూజుపట్టాయి. మరోవైపు ఎక్కడా పంటలు దెబ్బతినలేదని వ్యవసాయ అధికారులు చెబుతుండటం గమనార్హం. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం, పెనుకొండ, పరిగి, మడకశిర, రొళ్ల మండలాల్లో మాత్రమే 109 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు నివేదిక రూపొందించారు. అనంతపురం జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే నష్టం లేదని తేల్చేశారు. బొమ్మనహాళ్, కణేకల్లు, ఉరవకొండ, వజ్రకరూరు మండలాల్లో జొన్న, మొక్కజొన్న పంటలు నీట మునిగాయి. మిరప పూత రాలడంతో రైతులు నష్టపోయారు.

రూ.2.40 లక్షలు నష్టపోయా..



-రామచంద్ర, రాగానిపల్లి, నల్లమాడ మండలం

నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. ఐదు రోజుల కిందట పంట తొలగించి కల్లంలో ఆరబెట్టాం. వర్షానికి పంట తడిసిపోయింది. మొలకలు వచ్చి పంట దెబ్బతింది. నెల కిందట క్వింటాలు రూ.2,900 ఉండగా.. ఇప్పుడు వర్షాల కారణంగా రూ.650 తగ్గించారు. నాలుగు ఎకరాల్లో 120 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అమ్మితే రూ.2.40 లక్షలు వచ్చేది. మొలకెత్తడంతో రూపాయి కూడా వచ్చే అవకాశం లేదు.

80 క్వింటాళ్లు వర్షార్పణం



రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. 80 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. వర్షాలకు కల్లంలోని పంట మొలకెత్తింది. ప్రస్తుతం మార్కెట్ ధర ప్రకారం రూ.1.60 లక్షలు వచ్చేది. ఇప్పుడు ఈ మొత్తం నష్టపోయినట్టే. పెట్టుబడి కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు. **- శివశంకర్, యర్రగుంట, కణేకల్లు మండలం**

మొలకెత్తిన మొక్కజొన్న

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలో పలుచోట్ల మొక్కజొన్న కల్లాల్లోనే మొలకెత్తింది. ఉమ్మడి జిల్లాలో 55 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. కణేకల్లు, బొమ్మనహాళ్, పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు మండలాల్లో ఆరబోసిన మొక్కజొన్న మొలకెత్తడంతో రూపాయి కూడా చేతికొచ్చే పరిస్థితి లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా 1500 ఎకరాల్లో పంట నష్టపోయినట్లు అంచనా. నిబంధనల పేరుతో అధికారులు పంటనష్టం వివరాలు నమోదు చేసుకోవడం లేదని వాపోతున్నారు. దీంతోపాటు వర్షానికి మిరపలో పూత రాలిపోయింది. ఫలితంగా దిగుబడి వచ్చే అవకాశం కనిపించడం లేదు. ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షలు పెట్టుబడి పెట్టామని.. పంట చేతికొచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.



జలమయమైన ఆలయ ముందు భాగం

ఖాద్రీశుడి ఆలయంలోకి వరద

కదిరి, న్యూస్‌టుడే : కదిరిలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి వరద నీరు ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ప్రవహించింది. భక్తులు స్వామి వారిని రాత్రి 8గంటల వరకు దర్శనం చేసుకుంటూ ఉంటారు. సాయంత్రం 5.50 నుంచే వర్షం కురవడం మొదలైంది. దీంతో వరద తూర్పు ద్వారం నుంచి ఆలయంలోకి ప్రవేశించింది. అప్పటికే ఆలయంలోనే ఉన్న భక్తులు ఇబ్బందిపడ్డారు. ఆలయ ముందు భాగంలోని కాలువలు స్తంభించిపోవడం, సక్రమంగా లేకపోవడంతో ప్రవేశద్వారం నుంచి పడమటి గోపురం మార్గం గుండా బయటకు వెళ్లాయి. వరద ఆగేవరకు భక్తులు అగచాట్లు పడ్డారు.



తూర్పు గోపుర ద్వారం గుండా ఆలయంలోకి వస్తున్న వర్షపునీరు





సభకు హాజరైన సంఘం నాయకులు, ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి సవిత, వేదికపై ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, దగ్గపాటి వెంకటప్రసాద్, పరిటాల సునీత, గుమ్మనూరు జయరాం, అమిలినేని సురేంద్రబాబు, బండారు శ్రావణిశ్రీ, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల తెదేపా అధ్యక్షులు వెంకటశివుడుయాదవ్, కొల్లకుంట అంజనప్ప తదితరులు

ఉత్తమ పాలనకు వాల్మీకి రచనలు స్ఫూర్తి

ఘనంగా మహర్షి రాష్ట్రస్థాయి జయంత్యుత్సవం

అశోక్‌నగర్ (అనంత సంక్షేమం), న్యూస్‌టుడే: కుటుంబ వ్యవస్థ ఎలా ఉండాలి, మంచి పాలన ఎలా సాగించాలో మహర్షి వాల్మీకి రచనలు స్ఫూర్తిగా నిలుస్తాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. అనంతపురంలో గురువారం వాల్మీకి రాష్ట్రస్థాయి జయంతి ఉత్సవాన్ని కూటమి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. ముందుగా పాతూరు పవర్ ఆఫీసు వద్ద ఉన్న వాల్మీకి విగ్రహానికి ప్రజాప్రతినిధులు నివాళి అర్పించారు. అనంతరం గుత్తి రోడ్డులోని బల్లా కన్వెన్షన్ హాల్లో సభ నిర్వహించారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, ఎంపీలు, ఎమ్మెల్యేలు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వాల్మీకి, కురుబలకు రాజకీయ ప్రాధాన్యం ఇచ్చిన ఘనత తెదేపాకే దక్కుతుందన్నారు. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వాల్మీకులు దశాబ్దాలుగా వెనుకబాటుకు గురయ్యారని, గత వైకాపా ప్రభుత్వం మరింత వెనుకబడే విధంగా చేసిందని విమర్శించారు. టవర్‌క్లాక్ వద్ద ఉన్న బ్రిడ్జికి వాల్మీకి వారధిగా నామకరణం చేయాలని కోరారు. హిందూపురం ఎంపీ బి.కె.పార్థసారథి మాట్లాడుతూ వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చడానికి పార్లమెంటులో ఒత్తిడి తీసుకొచ్చి సాధిస్తామన్నారు. రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ గత ఐదేళ్ల అధికారంలో ఉన్న వైకాపా.. వాల్మీకులకు తీరని ద్రోహం చేసిందన్నారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ఎంపీలు చొరవ చూపాలన్నారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ వాల్మీకి సమాజానికి మార్గదర్శి అని కొనియాడారు. కళ్యాణదుర్గం, గుంతకల్లు, శింగనమల, మడకశిర ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, గుమ్మనూరు జయరాం, బండారు శ్రావణిశ్రీ, ఎం.ఎస్.రాజు, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి పోలా భాస్కర్, కలెక్టరు వినోద్‌కుమార్ ప్రసంగించారు. బీసీ సంక్షేమ సాధికారత అధికారి ఖుష్బు కొఠారి, తెదేపా రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, జనసేన నాయకులు ఈశ్వర్, జడ్పీ మాజీ ఛైర్మన్ పూల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దసరాకు ఆర్టీసీ ఆదాయం రూ. అరకోటి



అశోక్‌నగర్(అనంతపురం ఆర్టీసీ), న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా ఆర్టీసీ డిపోల పరిధిలో దసరా సందర్భంగా నడిపిన ప్రత్యేక బస్సుల ద్వారా రూ.51.20లక్షల ఆదాయం సమకూరింది. ఈనెల 9 నుంచి 14వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడిపారు. హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ, చెన్నై, నెల్లూరు ప్రాంతాల నుంచి తిరుగు ప్రయాణానికి మొత్తం 173 బస్సులు 1,18,373 కిలోమీటర్లు తిరిగాయి. ఆయా ప్రాంతాల నుంచి 15,653 మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చారు. గతేడాది రూ.45లక్షలు రాగా ఈ ఏడాది ఆదాయం పెరిగింది. ప్రత్యేక సర్వీసుల ద్వారా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంతో పాటు ఆర్టీసీకి ఆదాయం సమకూరిందని ఆర్‌ఎం సుమంత్ ఆర్ ఆదోని హర్షం వ్యక్తం చేశారు.

డిపో	ఆదాయం (రూ.ల్లో)
అనంతపురం	13,24,318
గుత్తి	68,395
గుంతకల్లు	3,88,401
కళ్యాణదుర్గం	3,79,305
రాయదుర్గం	7,87,240
తాడిపత్రి	13,50,920
ఉరవకొండ	8,21,965

68 పోస్టులు.. 1,877 దరఖాస్తులు

కేజీబీవీలో ఉద్యోగాలకు నేడు ధ్రువపత్రాల పరిశీలన

ఎస్కేయూ, న్యూస్‌టుడే: సమగ్రశిక్షా పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో బోధన, బోధనేతర ఉద్యోగాలకు తీవ్ర పోటీ నెలకొంది. అనంత జిల్లాలో బోధన ఉద్యోగాలు 41, బోధనేతర ఉద్యోగాలు 27 కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. ఈ పోస్టులకు కేవలం మహిళలు మాత్రమే అర్హులు. 68 పోస్టులకు 1,877 దరఖాస్తులు వచ్చాయి. 1:5 నిష్పత్తి ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేశారు. శుక్రవారం ఉదయం 9.30 నుంచి అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని ఇన్‌ఛార్జి ఏపీసీ నాగరాజు తెలిపారు. గతంలో మార్కుల మెరిట్‌తో పాటు బోధన సామర్థ్యంలో రాణించిన వారికి ఉద్యోగాలు ఇచ్చారు. ఈసారి కేవలం మార్కుల మెరిట్ ప్రకారం ఉద్యోగాలు ఇస్తున్నారు. వాటితోపాటు కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లోని వసతి గృహాల్లో వంట మనిషి, సహాయకులు తదితర 71 ఉద్యోగాలు భర్తీ చేస్తున్నారు. వాటికి ఎంఈఓలు దరఖాస్తులు స్వీకరించారు. ఆ ఉద్యోగాలు కూడా భర్తీ చేయడానికి సమగ్రశిక్షా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

కమీషన్ ఇచ్చుకో.. లేదంటే వదులుకో!

మద్యం దుకాణాలు దక్కించుకున్నవారికి బెదిరింపులు




ఈనాడు, అనంతపురం: మద్యం దుకాణాలపై పెత్తనం కోసం కొందరు అధికార పార్టీ నాయకులు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. లాటరీ ద్వారా దుకాణాలు దక్కించుకున్న వారిని బెదిరిస్తున్నారు. ఎంతోకొంత తీసుకుని షాపులు వదిలేసుకోవాలని.. లేదంటే వ్యాపారం చేయలేరని హెచ్చరిస్తున్నారు. తమ అనుచరులను రంగంలోకి దింపి బేరసారాలు చేయిస్తున్నారు. దరఖాస్తు చేసే సమయంలో ఉమ్మడి జిల్లాలోని కొందరు ప్రజాప్రతినిధులు ఇలాగే వీరంగం సృష్టించారు. మేము తప్ప ఎవరూ దరఖాస్తు చేయకూడదంటూ బెదిరింపులకు దిగారు. ఈ పరిణామాలపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేయడంతో కొందరు వెనక్కి తగ్గారు. ఇప్పుడు దుకాణాలు వదులుకోలేని పక్షంలో లాభంలో 30 శాతం ఇవ్వాల్సిందేనని హుకుం జారీ చేస్తున్నారు. ఫలితంగా దుకాణాలు దక్కించుకున్న కొందరు ఇప్పటికీ లైసెన్సు ఫీజు చెల్లించలేదు. మరికొందరు అధికార పార్టీ నాయకులు అడిగినంత ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. బాధితుల్లో చాలామంది అధికార పార్టీకి చెందినవారే కావడం గమనార్హం.

★ అనంత నగరంలోని దుకాణాలు తమకే కావాలంటూ ఓ నాయకుడు మద్యం షాపులు దక్కించుకున్నవారితో మంతనాలు జరుపుతున్నారు. అనుచరుల ద్వారా ఒక్కొక్కరినీ వ్యక్తిగతంగా పిలిపించుకుని 30 శాతం ఇవ్వాల్సిందేనని పట్టుబడుతున్నారు. అతని వద్ద ఉన్న లిక్కర్ వ్యాపారి ఒకరు మొత్తం వ్యవహారం నడిపిస్తున్నారు. ఈ క్రమంలోనే కొందరు లైసెన్సు ఫీజులు చెల్లించలేదు. సకాలంలో చెల్లించకపోతే రెండో వ్యక్తికి కేటాయిస్తారు. ఇలా అనంతపురం పరిధిలోనే నాలుగు షాపులను దౌర్జన్యంగా దక్కించుకున్నట్లు తెలుస్తోంది. పాపంపేట పరిధిలోని ఓ నాయకుడు అనంత నగరంలో ఓ దుకాణం దక్కించుకున్నారు. నగరంలోని ఓ నాయకుడి అనుచరులు అతనికి ఫోన్ చేసి 30 శాతం ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. ఈనేపథ్యంలో అతడు అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం.

★ తాడిపత్రిలో ఓ నాయకుడి అనుచరుడికి ఆరు దుకాణాలు దక్కాయి. నియోజకవర్గంలోని అన్ని షాపులను తన గుప్పిట్లోకి తీసుకోవాలని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. తమకు అప్పగించని పక్షంలో 20 శాతం కమీషన్ కట్టాల్సిందేనని తేల్చి చెబుతున్నారు. ఇప్పటికే ఇద్దరు ఫీజు కట్టకుండా చేసి వారి నుంచి దుకాణాలు దక్కించుకున్నట్లు తెలుస్తోంది.

నేత్రపర్వంగా చింతలరాయుడి రథోత్సవం



స్వామి కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు



భక్తుల మధ్య సాగుతున్న రథోత్సవం

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని చింతల వెంకటరమణస్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం కల్యాణం, రథోత్సవం వైభవంగా సాగింది. ఉదయం చింతలరాయుడు, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య సంప్రదాయంగా కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం స్వామి వార్లను పట్టువస్త్రాలతో అలంకరించి పురవీధుల్లో మహారథోత్సవాన్ని నిర్వహించారు. వేడుకల్లో నరసింహుడు, వెంకటేశ్వరస్వామి, ఆంజనేయుడి వేషధారణలు పలువురిని ఆకట్టుకున్నాయి. భక్తులు విశేషంగా తరలివచ్చారు.

ముందు జాగ్రత్తలే శ్రీరామరక్ష

- వర్షంతో పంటలకు చీడపీడలు ఆశించే అవకాశం
- సకాలంలో మందులు పిచికారీ చేయాలని శాస్త్రవేత్తల సూచన



ఆముదం పంటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు చంద్రాయుడు, మల్లికార్జున తదితరులు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: ప్రస్తుతం తుపాను ప్రభావంతో కురుస్తున్న తేలికపాటి వర్షాల నుంచి పంటలను కాపాడుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త చంద్రాయుడు తెలిపారు. కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్‌లోని పంట పొలాలను శాస్త్రవేత్తల బృందం సందర్శించింది. ఆముదం, కంది, టమాట, అరటి పంటలను పరిశీలించారు. తుపాను కారణంగా పంటలకు ఆశించే చీడలు, తెగుళ్లు వాటి నివారణ చర్యల గురించి శాస్త్రవేత్త వివరించారు.

● ఉమ్మడి అనంతపురం జిల్లాలో రైతులు ఆముదం పంటను 22,340 హెక్టార్లలో సాగు చేశారు. ప్రస్తుతం పంట రెండు, మూడో గెల దశలో ఉంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు బూజు తెగులు ఆశించే అవకాశం ఉంది. నివారణకు హెక్సాకొనజోల్ 2.మి.లీ లీటరు నీటికి లేదా కార్బెండజిమ్ 2గ్రాములు లీటరు నీటికి పిచికారీ చేసుకోవాలి.

● కంది పంటను రైతులు 1.40 లక్షల హెక్టార్లలో సాగు చేశారు. ప్రస్తుతం పూత, పిందె దశలో ఉంది. వర్షాలకు మొగ్గతొలుచు పురుగు, కాయతొలుచు పురుగు, వెర్రితెగులు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంది. నివారణకు స్పైరోటెట్రామెట్ 400మి.లీ. 200 లీటర్ల నీటికి లేదా బెరాజైడ్ 400మి.లీ. 200 లీటర్ల నీటికి కలిపి ఎకరాకు పిచికారీ చేసుకోవాలి.

పంట ఆశాజనకంగా ఉండటంతో ఎకరాకు 4క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

● టమాట పంట పూత దశలో ఉంది. ఆకుముడత తెగులు ఆశించే అవకాశం ఉన్నందున హెక్సాకొనజోల్ 2మి.లీలు లీటరు నీటికి కలిపి లేదా సాఫ్ 2.5గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

● అరటి 20వేల హెక్టార్లలో సాగు చేశారు. పంటలో సిగటోక ఆకుమచ్చ తెగులు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంది. నివారణకు రైతులు డైఫెన్‌కొనజోల్ 1మి.లీ, మినరల్ ఆయిల్ 10మి.లీలు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

● దానిమ్మ 10వేల హెక్టార్లలో సాగయ్యింది. పంటలో బాక్టీరియల్ ఆకుమచ్చ తెగులు ఎక్కువగా ఆశించే అవకాశం ఉంది. నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రాములు లీటరు నీటికి లేదా స్ట్రెప్టోసైక్లిన్ 0.1గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని శాస్త్రవేత్త సూచించారు.

బ్యాంకు నిరర్థక ఆస్తుల తగ్గింపుపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న జేసీ శివనారాయణ శర్మ, అధికారులు

తపోవనం(అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నిరర్థక ఆస్తుల శాతాన్ని గణనీయంగా తగ్గించాలని సంయుక్త కలెక్టర్ శివనారాయణ శర్మ ఆదేశించారు. ప్రతి మేనేజరు ఎన్‌పీఏ శాతాన్ని పూర్తిగా తగ్గించడంపై ప్రధాన దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. గురువారం బ్యాంకు ప్రధాన కార్యాలయంలో అన్ని శాఖల మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ బ్యాంకు అన్ని విధాలా అభివృద్ధి సాధించాలంటే పాత బకాయిల వసూలుపై చర్యలు తీసుకోవాలన్నారు. వాయిదా మీరిన రుణాలు రాబట్టడానికి న్యాయపరమైన చర్యలకు ఉపక్రమించాలని సూచించారు. అదేవిధంగా స్వయం సహాయక బృందాలకు రుణాలు విరివిగా మంజూరు చేసి స్వయం ఉపాధిని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. కొత్తగా ప్రవేశపెట్టిన 444 రోజుల డిపాజిట్ పథకాన్ని విస్తృతంగా ప్రచారం చేసి లక్ష్యాలను అధిగమించాలన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ పూర్తి కావాలంటే ఆయా శాఖల మేనేజర్లు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. బకాయిలు చెల్లించే స్థోమత ఉన్న వారిపై దృష్టి పెట్టి న్యాయపరమైన తాఖీదులు జారీ చేయాలన్నారు. సమావేశంలో బ్యాంకు సీఈఓ సురేఖరాణి, జిల్లా సహకార శాఖ అధికారి అరుణకుమారి, నాబార్డు డీడీఎం అనురాధ, డీఎల్‌సీఓ ప్రభాకర్‌రెడ్డి, ఓఎస్‌డీ సూర్యనారాయణ, డీజీఎంలు విజయచంద్రారెడ్డి, రాంప్రసాద్, సుఖదేవబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం శాఖల వారీగా వివిధ అంశాలపై సంయుక్త కలెక్టర్ సమీక్షించారు.

హంద్రీనీవా ఎస్‌ఈగా సీఈ నాగరాజు

నలుగురు డీఈలకు ఈఈలుగా బాధ్యతలు

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: జిల్లా జలవనరుల శాఖలో పలు కీలక పోస్టుల్లోకి ఇన్‌ఛార్జి అధికారులను నియమించారు. గురువారం ఆ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వు జారీ చేశారు. జిల్లా జలవనరుల శాఖ ముఖ్య ఇంజినీరు(సీఈ) కె.నాగరాజుకే హంద్రీనీవా ఎఫ్‌ఏసీ పర్యవేక్షక ఇంజినీరుగా(ఎస్‌ఈ) నియమించారు. ప్రస్తుత సీఈ పోస్టులో ఇన్‌ఛార్జిగానే ఉన్నారు. ఈయన వాస్తవ పోస్టు విజయవాడలో ప్రాధాన్యత ప్రాజెక్టుల పర్యవేక్షక విభాగం ఎస్‌ఈగా ఉన్నారు. అక్కడి నుంచి రెండు మాసాల క్రితం ఇన్‌ఛార్జి సీఈగా బాధ్యతలు తీసుకున్నారు. మొన్నటి దాకా హంద్రీనీవా ఎస్‌ఈగా పని చేసిన దేసేనాయక్ నెల్లూరుకు బదిలీ అయ్యారు. ఈయన్ను కూడా ప్రస్తుతం నెల్లూరు జలవనరుల శాఖ ఎస్‌ఈగా నియమించారు. ఇదిలా ఉండగా.. జిల్లాలో పని చేస్తున్న ముగ్గురు సీనియర్ డీఈలు, ఇతర జిల్లాకు చెందిన ఒక డీఈకి ఈఈలుగా బాధ్యతలు అప్పగించారు. అనంత హంద్రీనీవా డివిజన్-7 ఈఈ బాధ్యతలను డీఈ గుర్రం శ్రీనివాసులుకు, నందికొట్కూరు డివిజన్‌లో పని చేస్తున్న డీఈ సాకే రాధాకృష్ణ పెనుకొండ ఐబీ డివిజన్ ఈఈగా నియమితులయ్యారు. హంద్రీనీవా మదనపల్లి సర్కిల్ పరిధిలోని కదిరి డివిజన్-11 ఈఈగా పెనుకొండ ఐబీ డివిజన్ డీఈ గంగాధర్, అనంత డివిజన్-7 డీఈగా ఉన్న రాజన్‌బాబును నందికొట్కూరు డివిజన్ ఈఈగా నియమించారు. వీరందరూ ఒకట్రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

చెక్ బౌన్స్ కేసులో ఏఎన్‌ఎంకు 6నెలల జైలుశిక్ష.. రూ.6 లక్షల జరిమానా

గోరంట్ల, పెనుకొండ, న్యూస్‌టుడే: గోరంట్ల మండలంలోని పాలసముద్రం గ్రామానికి చెందిన వెంకటనారాయణమ్మకు ప్రభుత్వ ఎన్ఎంఎం భారతి డబ్బు ఇవ్వాల్సి ఉండగా చెక్ ఇచ్చింది. అది బౌన్స్ కావడంతో కేసు నమోదైంది. దీంతో బాధితురాలు కోర్టుకు వెళ్లడంతో విచారణ చేసిన పెనుకొండ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ న్యాయమూర్తి మసాలా బొజ్జప్ప భారతికి ఆరు నెలల సాధారణ జైలు శిక్ష, రూ.6లక్షల జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెలువరించినట్లు కోర్టుకానిస్టేబుల్ బాబ్‌జాన్ తెలిపారు. జరిమానా చెల్లించలేని పక్షంలో అదనంగా ఒకటిన్నర నెల జైలుశిక్ష అనుభవించాలని తీర్పు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇదే కేసుకు సంబంధించి కోర్టు నెల క్రితం అరెస్టు వారెంట్ జారీ చేయడంతో వెళ్లిన పోలీసులపై దాడి చేయగా రొద్దం పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులో ప్రస్తుతం ఆమె రిమాండ్‌లో ఉన్నట్లు కానిస్టేబుల్ వివరించారు.

పోలీసుల అదుపులో మరో నిందితుడు?

హిందూపురం, న్యూస్‌టుడే: చిలమత్తూరు మండలం నల్లబొమ్మపల్లిలో అత్తా, కోడలిపై సామూహిక అత్యాచారం కేసులో నిందితుడై పరారిలో ఉన్న చాకలి శ్రీనివాసులును ప్రత్యేక పోలీసులు గురువారం రాత్రి మడకశిర ప్రాంతంలో అదుపులోకి తీసుకొన్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. ఈ ఘటనలో ఆరుగురు నిందితులు పాల్పడగా ఇప్పటికే పోలీసులు ఐదుగురిని అరెస్ట్ చేశారు. ఇతను పరారిలో ఉండటంతో ఇతని ఆచూకీ కోసం ప్రత్యేక పోలీసులు గాలింపు చేపట్టారు. ఇతడిది లేపాక్షి మండలం కల్లూరు గ్రామమైనా ప్రస్తుతం హిందూపురం పట్టణం త్యాగరాజనగర్‌లో నివాసం ఉంటున్నాడు.

పిడుగుపాటుకు రైతు మృతి



జయరాం

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరి మండలం కాళసముద్రం గ్రామానికి చెందిన రైతు జయరాం (49) పిడుగుపాటుకు మృతిచెందారు. కుటుంబ సభ్యులు, స్థానికులు మేరకు వివరాలు. గురువారం సాయంత్రం మెరుపులు, ఉరుములతో కూడిన భారీవర్షం కురిసింది. మేతకు వెళ్లిన గేదెలను ఇంటికి తోలుకొచ్చేందుకు జయరాం గ్రామ సమీపంలోని పొలాల్లోకి వెళ్లి గేదెలతో పాటు ఇంటికి వచ్చే సమయంలో పిడుగుపాటుకు గురయ్యారు. తీవ్రంగా గాయపడిన జయరాంను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నిస్తుండగా మృతి చెందారు. రైతుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సకాలంలో లక్ష్యాలు పూర్తి చేయాలి



సమీక్షలో మాట్లాడుతున్న సంయుక్త సంచాలకులు డాక్టర్ మాధవరావు, పక్కన జేడీఏ డాక్టర్ వెంకటస్వామి తదితరులు

రాంనగర్(అనంతపురం), న్యూస్‌టుడే: జిల్లా పశుసంవర్ధకశాఖకు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆశాఖ సంయుక్త సంచాలకులు మాధవరావు(డైరెక్టరేట్) ఆదేశించారు. గురువారం అనంతపురం డివిజన్ కార్యాలయంలో జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ వెంకటస్వామి అధ్యక్షతన నిర్వహించిన సమీక్షకు జేడీఏహెచ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాకు 1500 మినీ గోకులాలు(పశువుల షెడ్లు) మంజూరు చేశామన్నారు. ఉపాధి హామీ పథకం కింద షెడ్ల నిర్మాణ పనులు నెమ్మదిగా జరుగుతున్నాయని, త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులకు పంట రుణాల మాదిరిగానే పాడి రైతులకు పశుకిసాన్ క్రెడిట్ కార్డులు పంపిణీ చేయాలని నిర్ణయించామని, జిల్లాకు 11 వేల కార్డులు మంజూరు చేశామన్నారు. ఎవరు జామినీ లేకుండా బ్యాంకుల ద్వారా రూ.1.60 లక్షల వరకు రుణం పొందవచ్చన్నారు. అన్ని బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించేలా చూడాలని లీడ్ బ్యాంకు మేనేజర్ నరసింగరావును కోరారు. ఈ నెలాఖరులోపు అన్ని గొర్రెలకు నట్టల నివారణ మందు తాపించే ప్రక్రియ పూర్తి చేసేలా చూడాలని పశువైద్యులను ఆదేశించారు. ఉచిత పెయ్యిదూడల పథకాన్ని మరింత సమర్థంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సలీంబాషా, ఎల్డీఎం నరసింగరావు, పశుగణాభివృద్ధి సంస్థ ఈవో డాక్టర్ సుధాకర్, డీడీఏహెచ్‌లు రమేశ్‌రెడ్డి, వెంకటేశ్, ఏడీఏహెచ్‌లు, పశువైద్యులు పాల్గొన్నారు.

టపాసుల అక్రమ రవాణా

హిందూపురంలో రూ. 20 లక్షల సరకు పట్టివేత

అరవిందనగర్(అనంతపురం), న్యూస్‌టుడే: ఈ-వేబిల్లు, ఇన్‌వాయిస్ లేకుండా టపాసులు తరలిస్తున్న లారీలను నిఘా విభాగం, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు గురువారం పట్టుకున్నారు. అనంతపురం నగరంలో నిఘా విభాగం అధికారులు తనిఖీలు చేస్తుండగా టపాసులను అక్రమంగా తరలిస్తున్న లారీ పట్టుబడింది. విచారణ నిమిత్తం లారీని వాణిజ్య పన్నులశాఖ అధికారులకు అప్పగించారు. ఇన్‌వాయిస్‌లో ఒక తేదీ, ఈ-వేబిల్లులో ఒక తేదీ ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. హిందూపురంలోనూ వాణిజ్య పన్నుల శాఖ అధికారులు టపాసులను అక్రమంగా తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నారు. శివకాశి నుంచి బీదర్‌కు ఈ-వేబిల్లు లేకుండా టపాసులు రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. వాటి విలువ రూ.20లక్షలు ఉంటుందని వాణిజ్య పన్నుల శాఖ సంయుక్త కమిషనర్ శేషాద్రి చెప్పారు.

కేంద్ర మంత్రి మురుగన్ రాక నేడు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: సత్యసాయి మహాసమాధి దర్శనార్థం కేంద్ర సమాచార, పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్ శుక్రవారం పుట్టపర్తి రానున్నారు. బెంగళూరు నుంచి ప్రత్యేక కాన్వాయ్‌లో మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రశాంతి నిలయం చేరుకుంటారు. సత్యసాయి మహాసమాధిని దర్శించుకుంటారు. శాంతిభవన్ అతిథి గృహంలో విశ్రాంతి తీసుకుంటారు. సాయంత్రం 4.30 గంటలకు బెంగళూరుకు వెళతారు. మంత్రి రాకను పురస్కరించుకుని బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు.

తేనెటీగల దాడిలో పశువుల కాపరి మృతి



నారాయణప్ప

సోమందేపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని మాగేచెరువుకు చెందిన పెద్దింటి నారాయణప్ప(65) గురువారం అడవి తేనెటీగల దాడిలో మృతి చెందారు. గ్రామస్థులు, బంధువుల కథనం మేరకు వివరాలిలా.. నారాయణప్ప రోజులాగే గురువారం పాడి పశువులను మేపడానికి చాకార్లపల్లి జగనన్న కాలనీ సమీపానికి వెళ్లారు. సాయంత్రం అడవి తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేశాయి. విలవిలలాడుతూ ఇంటికి వస్తున్న విషయాన్ని గుర్తించిన సోదరుడి కుటుంబ సభ్యులు, బంధువులు వెంటనే ఆయన్ను కారులో హిందూపురం ఆసుపత్రికి తరలించగా అక్కడ ప్రాణాలు వదిలారు.

పచ్చని సంసారంలో ఒక్కొక్కరు మృత్యువాత

నాలుగేళ్ల కిందటి వరకు ఎంతో సుఖ సంతోషాలతో సాఫీగా జీవనం సాగించిన కుటుంబం అది. విధికి కన్ను కుట్టిందేమో. పచ్చని సంసారంలో ఒక్కొక్కరే మృత్యువాత పడ్డారు. కుమారుడు అశోక్‌కుమార్ నాలుగేళ్ల కిందట కరోనా మహమ్మారి బారిన పడటంతో మృతి చెందగా..అతని బెంగతో తల్లి అంజనమ్మ ఆరు నెలల కిందట అనారోగ్యానికి గురై చనిపోయారు. ప్రస్తుతం కోడలు, మనవడు ఉన్న ఆ కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న నారాయణప్ప మృతి చెందడాన్ని సోదరుడి కుటుంబం, బంధువులు, మిత్రులు, పలువురు గ్రామస్థులు జీర్ణించుకోలేక..ఆ కుటుంబ పరిస్థితిని గుర్తుచేసుకొని కంటతడి పెట్టారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకొన్నాయి.

కన్నోళ్ల ఆశలు ఆవిరి

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం
- ఆకులేడులో విషాదం

ఆ ఇద్దరు మంచి స్నేహితులు. చిన్నతనం నుంచి కలిసి మెలిసి తిరిగారు. ఎక్కడికి పోవాలన్నా జతగా వెళ్లడం అలవాటు. ఆ మిత్రుల అన్యోన్య బంధాన్ని చూసి ఎవరికి ఈర్ష కలిగిందో ఏమో. రోడ్డు ప్రమాద రూపంలో వారి జీవితాలు అర్ధాంతరంగా ముగిసిపోయాయి. చివరకు వల్లకాడికి సైతం కలిసే వెళ్లారు. కన్నోళ్ల ఆశలన్నీ ఆవిరి చేశారు. ఈ హృదయ విదారక ఘటన శింగనమల మండలం ఆకులేడు గ్రామాన్ని శోకసంద్రంలో ముంచింది.



సుబ్బరాయుడు జయసింహా

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : శింగనమల మండలం ఆకులేడు గ్రామానికి చెందిన సుబ్బరాయుడు(21), జయసింహా(22) మంచి స్నేహితులు. ఈ నెల 13న అర్ధరాత్రి పని నిమిత్తం ఆకులేడు నుంచి అనంతపురం నగరానికి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. మండల పరిధిలోని గుత్తిరోడ్డు ఏటీఎం వద్దకు రాగానే వాహనం అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈఘటనలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దర్నీ బంధువులు కర్నూలు వైద్యశాలకు తరలించారు. గురువారం తెల్లవారు జామున సుబ్బరాయుడు, మధ్యాహ్నం జయసింహా చికిత్సపొందుతూ మృతి చెందారు. సుబ్బరాయుడు వారి తల్లిదండ్రులకు ముగ్గురు కుమార్తెల తర్వాత కలిగిన ఒక్కగానొక్క కుమారుడు. జయసింహా తల్లిదండ్రులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కాగా జయసింహా రెండో కుమారుడు అని బంధువులు తెలిపారు. చేతికొచ్చిన పిల్లలు రోడ్డు ప్రమాదంలో మరణించడంతో వారి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. ఈఘటనపై బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసి చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఓపెన్ స్కూలు ప్రవేశాలకు గడువు పొడిగింపు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ఏపీ ఓపెన్‌స్కూల్ ద్వారా పదోతరగతి, ఇంటర్ కోర్సుల్లో ప్రవేశాలకు గడువు పొడిగించినట్లు పరీక్షల విభాగం సంచాలకులు గోవిందనాయక్ తెలిపారు. ఈ నెల 25వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలన్నారు. రూ.200 అపరాధ రుసుంతో ఈనెల 26 నుంచి 29వ తేదీలోపు, రూ.500 అపరాధ రుసుంతో 31వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సార్వత్రిక విద్యాపీఠం ద్వారా 10వ తరగతి, ఇంటర్ చదవాలనుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జేఎన్‌టీయూలో తక్షణ ప్రవేశాలు

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ అనుబంధ ఓటీపీఆర్ఐలో ఎంఎస్సీ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు తక్షణ ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య సుదర్శనరావు తెలిపారు. ఏపీపీజీఈసెట్-2024లో అర్హత సాధించి, డిగ్రీలో ఉత్తీర్ణులైన వారు అర్హులు. ఈ నెల 21న జేఎన్‌టీయూలోని ప్రవేశాల విభాగంలో హాజరు కావాలని ఆయన కోరారు.

టమాటా కిలో రూ.60



రాంనగర్(అనంతపురం), న్యూస్‌టుడే: గత రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో అనంతపురం గ్రామీణం కక్కలపల్లి మార్కెట్‌కు టమాటా విక్రయాలు పూర్తిగా తగ్గిపోయాయి. సరకు తగ్గడంతో ధరలు కిలో గరిష్ఠం రూ.60, మధ్యస్థం రూ.45, కనిష్ఠం రూ.35 చొప్పున పలికాయి. మార్కెట్‌కు 15 కిలోల పెట్టెలు వచ్చాయి. ఒక్కో పెట్టె గరిష్ఠం రూ.900, మధ్యస్థం రూ.675, కనిష్ఠం రూ.525 చొప్పున ధరలు పలికాయని మార్కెట్ ఇన్‌ఛార్జి రాంప్రసాద్‌రావు తెలిపారు.

14,981 క్వింటాళ్ల పప్పుసెనగ విత్తనం పంపిణీ

రాంనగర్(అనంతపురం), న్యూస్‌టుడే: జిల్లాలో గత మూడ్రోజులుగా రాయితీ పప్పుసెనగ విత్తన పంపిణీ కొనసాగుతోంది. ఇప్పటి వరకు మొత్తం 19,289 క్వింటాళ్లు విత్తనం కావాలని 13,561 మంది రైతులు పేర్లు నమోదు చేసుకున్నారు. అందులో 14,981 క్వింటాళ్ల విత్తనాలను 9,689 మంది రైతులకు పంపిణీ చేశామని జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ తెలిపారు.

కసాపురం ఆలయ స్థల సరిహద్దుల గుర్తింపు



సర్వేను పరిశీలిస్తున్న ఆలయ ఈఓ కె.వాణి, అధికారులు

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే : కసాపురం ఆలయంలో పరిధిలోని భూమికి గల సరిహద్దుల గుర్తింపునకు గురువారం సర్వే నిర్వహించారు. సర్వే నంబరు 191, 191ఏలోని 24.97 ఎకరాల స్థలంలో సర్వే చేసి హద్దులు గుర్తించి రాళ్లు పాతారు. కార్యక్రమాన్ని ఆలయ ఈఓ కె.వాణి, అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ పర్యవేక్షించారు. ఆలయ అధికారులు, సిబ్బంది, సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు నగదు బహుమతులు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో 7, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించి, ప్రతిభ కనబరచిన వారికి నగదు బహుమతులు అందజేస్తున్నట్లు ఎడ్యుకేషన్ ఎపిఫని సంస్థ జిల్లా సమన్వయకర్త నరేశ్ తెలిపారు. ఇతర వివరాలకు 9573139996, 7989796602 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వేటకొడవలితో ఇద్దరిపై దాడి

నిందితుడిపై పోక్సో, హత్యాయత్నం కేసు

గార్లదిన్నె, న్యూస్‌టుడే : మండల పరిధిలోని మర్తాడు గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన ఘర్షణలో గౌస్‌పీరా అనే వ్యక్తి వేటకొడవలి దాడి చేయడంతో ఇద్దరు గాయపడ్డారని ఎస్సై గౌస్ బాషా తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన రాము, గౌస్‌పీరా ఓ విషయంలో ఇద్దరూ వాదులాడుతున్నారు. ఈక్రమంలో తెదేపా నాయకుడు రాజు, బ్రహ్మయ్య వారికి సర్దిచెప్పి ఇంటికి బయలుదేరుతుండగా గౌస్‌పీరా వేటకొడవలితో దాడి చేయగా ఇద్దరూ గాయపడ్డారు. గౌస్‌పీరా ఓ బాలికను తరచూ వేధిస్తుండగా ఆమె గతంలో ఆత్మహత్యాయత్నం చేసింది. ఆ విషయంలోనే గొడవ జరిగిందని పోలీసులు తెలిపారు. బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో గౌస్‌పీరాపై పోక్సో, హత్యాయత్నం కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: మడకశిర పట్టణ సమీపంలోని వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల వద్ద జాతీయ రహదారిపై గురువారం ఆటోను బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న రత్నమ్మ, శారద, వాసుదేవప్ప, రంగప్పతో పాటు మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు మడకశిర ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడి మృతి

కూడేరు (ఉరవకొండ), న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో వృద్ధుడు మృతిచెందిన ఘటన కూడేరు మండలంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా.. మండలంలోని కమ్మూరుకు చెందిన చిన్న ఓబులేశ్ (79) అనే వృద్ధుడు గురువారం వర్షానికి ఇల్లు కారుతోందని మిద్దె ఎక్కి చౌడు వేస్తున్నాడు. సర్వీసు వైరు (విద్యుత్తు తీగ) నుంచి సరఫరా రావడంతో విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అనంతపురం తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య లక్ష్మమ్మ, నలుగురు కుమారులు ఉన్నారు. మృతుడి కుమారుడు నరసింహులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

రైల్వే ఉద్యోగి బలవన్మరణం



మధుసూదన్

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే : గుంతకల్లులో మధుసూదన్(34) అనే రైల్వే ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నారని గురువారం ఒకటో పట్టణ పోలీసులు పేర్కొన్నారు. ఒకటో పట్టణ సీఐ మనోహర్ తెలిపిన వివరాల మేరకు ప్రొద్దుటూరు మండలం లింగాపురం గ్రామానికి చెందిన మధుసూదన్ గుంతకల్లులోని రైల్వే సీనియర్ డీసీఎం కార్యాలయంలో సీనియర్ క్లర్క్‌గా పని చేస్తున్నాడు. రెండు రోజుల కిందట కార్యాలయ సూపరింటెండెంట్‌గా పదోన్నతి వచ్చింది. ఇతను చర్చి స్కూల్ రోడ్డులో బ్యాడ్మింటన్ కోర్టు ఎదురుగా ఉన్న రైల్వే క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నారు. నాలుగేళ్ల కిందట మొదటి భార్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. వీరికి 11 ఏళ్ల మనుశ్రీ కుమార్తె ఉంది. రెండేళ్ల కిందట బళ్లారికి చెందిన హేమవతిని రెండో పెళ్లి చేసుకున్నాడు. ఆమె సాఫ్ట్‌వేరు ఇంజినీరుగా పని చేస్తున్నారు. దసరా పండగకు ప్రొద్దుటూరుకు వెళ్దామని భర్త పిలిచినా ఆమె రాకపోవడంతో అతను ఒక్కడే ఊరు వెళ్లి వచ్చాడు. దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో ఒకరినొకరు మాట్లాడుకోవటం లేదు. ఈక్రమంలో బుధవారం రాత్రి పడక గదిలోకి వెళ్లి తలుపు వేసుకున్నాడు. ఉదయం తలుపు తీయకపోవడంతో భార్య, స్థానికులు సహకారంతో తలుపును బద్దలు కొట్టి లోపలికి వెళ్లి చూడగా అతను ఫ్యానుకు ఉరి వేసుకున్నాడని పోలీసులు వివరించారు. మృతుడికి ఏరియా ఆసుపత్రిలో శవపరీక్షలు నిర్వహించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

ట్రేడ్ లైసెన్సులు తప్పనిసరి

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: ట్రేడ్ లైసెన్సులు తీసుకునే వ్యాపారాలు నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ హోటల్ యజమానులకు సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలోని హోటల్ యజమానులతో సమావేశమయ్యారు. హోటళ్లలో పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో వడ్డించరాదన్నారు. పరిశుభ్రత, వంటగదిని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మాంసహారాలను ఎక్కువ రోజులు నిల్వ ఉంచితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హోటళ్లలో తప్పనిసరిగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, మున్సిపల్ అధికారులు తనిఖీలు చేస్తుంటారని తెలిపారు. మున్సిపల్ పారిశుద్ధ్య అధికారి అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి విగ్రహ ఆవిష్కరణ

బ్రహ్మసముద్రం: మండలంలోని పాలవెంకటాపురంలోని సీతారామాంజనేయస్వామి ఆలయ సమీపంలో గ్రామస్థుల ఆధ్వర్యంలో గురువారం వాల్మీకి విగ్రహ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ముఖ్యఅతిథిగా హాజరై విగ్రహావిష్కరణ చేశారు. మహర్షి వాల్మీకి అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. తెదేపా మండల కన్వీనర్ శ్రీరాములు, వైద్యుడు లింగారెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు ప్రభావతమ్మ, వై.పి.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.


వాల్మీకి విగ్రహానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు


ఉరవకొండ: నింబగల్లులో పూజ చేస్తున్న అధికారులు, నాయకులు


శెట్టూరు: తిప్పనపల్లిలో..

కూటమి ప్రభుత్వంతో గ్రామాభివృద్ధి

ఉరవకొండ, న్యూస్‌టుడే: గ్రామాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని తెదేపా నాయకులు పేర్కొన్నారు. ఉరవకొండ మండలం నింబగల్లు, రాకెట్ల, విడపనకల్లు మండలం ఆర్.కొట్టాల గ్రామాల్లో గురువారం 'పల్లె పండగ' కార్యక్రమాన్ని నిర్వహించారు. సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఎంపీడీవో రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శెట్టూరు: మండలంలోని తిప్పనపల్లిలో గురువారం 'పల్లె పండగ' కార్యక్రమంలో భాగంగా సీసీరోడ్డు నిర్మాణానికి ఎంపీడీవో రఘురామ్‌రావు, తెదేపా నాయకులు భూమి పూజ చేశారు.

అసౌకర్యాల నడుమ కాలనీలు

విద్యుత్తు, నీటి, రహదారుల సమస్యలతో ఇక్కట్లు

ఉరవకొండ, న్యూస్‌టుడే: కాలనీలు ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా మౌలిక వసతులు లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉరవకొండ పట్టణంలోని ఎస్ఎల్ఎన్, శివరామిరెడ్డి కాలనీల్లో 1200 వరకు నివాస గృహాలు, 5 వేలకు పైగా జనాభా ఉంది. శివరామిరెడ్డి కాలనీలో పూర్తిస్థాయిలో సిమెంటు దారులను నిర్మించలేదు. మట్టి దారులతో చిన్నపాటి వర్షం పడినా వీధులు బురదగా మారడంతో కాలనీవాసులు రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. నీటి సమస్య కూడా వేధిస్తోంది. పలు వీధుల్లో నేటికీ విద్యుత్తు స్తంభాలను ఏర్పాటు చేయలేదు. కట్టెలపై తీగలు ఉండటంతో ప్రమాదకరంగా మారింది. వంక ఉండటంతో భారీ వర్షాలకు సగం కాలనీ నీట మునుగుతోంది. ఎస్ఎల్ఎన్ కాలనీలో కొంత మేర సిమెంటు దారులున్నా మురుగు కాలువల జాడలేదు. నీరు దారులపైకి రావడంతో పారిశుద్ధ్యం పడకేసింది. పలు వీధుల్లోని కుళాయిలకు తాగునీరు సరిగా రావడం లేదు. కణేకల్లు రహదారి నుంచి ఆ కాలనీకి వెళ్లే మట్టి దారి గుంతలు పడ్డాయి. వర్షం వస్తే పాదచారులు, వాహన చోదకులకు రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. సిమెంటు రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. దీనిని పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్ దృష్టికి తీసుకెళ్లగా.. కాలనీలను పరిశీలించి వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు.


ఎస్ఎల్ఎన్ కాలనీకి వెళ్లే ప్రధాన దారి దుస్థితి

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

రాయదుర్గం పట్టణం: 9666888046, కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661, ఉరవకొండ: 8008573071

సమస్య: మండలంలోని లింగదీర్లపల్లిలో వీధులు అపరిశుభ్రంగా ఉన్నాయి. **- మాసప్ప**

సమాధానం: తొలగింపు చర్యలు చేపడుతాం. **- మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శి**

సమస్య: మాకొడికి - లక్ష్మంపల్లి రోడ్డులో అడ్డుగా ఉన్న ముళ్లపొదలను తొలగించాలి. **- మహాదేవ**

సమాధానం: ఉపాధి ఏపీవోతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తాం. **- రఘురామ్‌రావు, ఎంపీడీవో** - న్యూస్‌టుడే, శెట్టూరు


మాట్లాడుతున్న సర్వేయర్ ప్రభాకర్

తప్పొప్పులను సరి చేయాలి

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని రీసర్వే జరిగిన గ్రామాల్లో రైతుల పంట పొలాలకు సంబంధించి దొర్లిన తప్పొప్పులను సరిచేయాలని మండల సర్వేయర్ ప్రభాకర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మండలంలోని గ్రామ సర్వేయర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. శుక్రవారం నుంచి రీసర్వేలపై గ్రామసభలు జరుగనున్నాయన్నారు. బోయలపల్లి, కుర్లపల్లి, పల్లి గ్రామాల్లో రీసర్వేలు జరిగాయని, పలువురికి రైతులకు సంబంధించి తప్పులు దొర్లాయన్నారు. దరఖాస్తులు స్వీకరించి సమస్యను పరిష్కరించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని హెచ్చరించారు.

బోరంపల్లిలో చిరుత సంచారం

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని బోరంపల్లిలో చిరుత సంచరిస్తుండటంతో గ్రామస్థులు భయాందోళకు గురవుతున్నారు. గురువారం గ్రామ సమీపంలోని గంగాపురం మార్గంలోని గంగమ్మ ఆలయం వద్ద కనిపించిందని పలువురు తెలియజేశారు. దీంతో వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లాలంటే రైతులు జంకుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు చిరుత నుంచి రక్షణ కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై అటవీశాఖ బీట్ నాగేనాయక్‌ను వివరణ కోరగా.. తమకు సమాచారం రాలేదని, పరిశీలించి నిఘా ఉంచుతామన్నారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

వజ్రకరూరు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బాలుడు సురేంద్ర (13) గురువారం మృతిచెందాడు. మండలంలోని గూళ్యపాళ్యం రైల్వే స్టేషన్ వెళ్లే రహదారి సమీపంలో ఈనెల 13న వజ్రకరూరుకు చెందిన వేమలనాయుడు, ఇద్దరు కుమారులతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నప్పుడు కారు ఢీకొన్న ప్రమాదంలో గాయపడ్డారు. అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం సురేంద్ర మృతిచెందాడు. తండ్రి పరిస్థితి కూడా విషమంగానే ఉన్నట్లు సమాచారం.


కళ్యాణదుర్గం: వాల్మీకి జయంతిలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు


రాయదుర్గం: పట్టణంలో వాల్మీకుల ద్విచక్ర వాహనాల ప్రదర్శన


ఉరవకొండ: వాల్మీకి జయంతి వేడుకల్లో తెదేపా నాయకులు


వజ్రకరూరు: వాల్మీకి చిత్రపటం ఊరేగింపు


బొమ్మనహాళ్: ఉద్దేహాళ్‌లో..

వాల్మీకి రచనలు అనుసరణీయం

మహర్షి వాల్మీకి ఆదర్శ ప్రాయుడని వక్తలు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వాల్మీకి జయంతిని గురువారం రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి విగ్రహాలకు పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. వాల్మీకుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రణాళికతో ముందుకు సాగుతుందని వాల్మీకులు, తెదేపా నాయకులు హర్షం వ్యక్తం చేశారు. **- న్యూస్‌టుడే, బృందం**


శెట్టూరు: యాటకల్లులో..


కళ్యాణదుర్గం: వాల్మీకి చిత్రపటానికి పూజలు చేస్తున్న వైకాపా సమన్వయకర్త రంగయ్య


ఉరవకొండ: వాల్మీకి విగ్రహం ఊరేగింపు


కణేకల్లు: జక్కలవడికిలో జయంతి వేడుకల్లో వాల్మీకులు, నాయకులు

యువకుడి ఆత్మహత్య


సర్వర్‌బాషా

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: మనస్తాపానికి గురై ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. [illegible] పట్టణంలోని కోతిగుట్ట సమీపంలో డ్రైవర్ల కాలనీలో నివాసముంటున్న సర్వర్‌బాషా (26) ప్రైవేటు వాహనాలకు డ్రైవర్‌గా వెళ్తున్నాడు. వివాహం కాకపోవడంతో తల్లిదండ్రులతో గొడవపడి ఒంటరిగా ఉంటున్నాడు. తరచూ కడుపునొప్పితో బాధపడేవాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఆధార్ అనుసంధానం తప్పనిసరి


గ్రామంలో పర్యటిస్తున్న ఆర్డీవో వినూత్న

బెళుగుప్ప, న్యూస్‌టుడే: ఆధార్ అనుసంధానంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కళ్యాణదుర్గం ఆర్డీవో వినూత్న సూచించారు. మండలంలోని ఆవులెన్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం కార్యాలయాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 6,645 మంది రైతులకు గాను కేవలం 1,050 మంది మాత్రమే ఆధార్ అనుసంధానం జరిగిందన్నారు. రోజు 400 మంది ఓటర్లకు అనుసంధానం చేయాలని సీఈవో మల్లికార్జునపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బెళుగుప్పలో 1657 మందికి గాను 1156 మంది రైతుల వివరాలు నమోదు చేసినట్లు తహసీల్దార్ షర్మిల తెలిపారు. త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రం వద్ద వర్షపునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సర్పంచి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కూలిన ఇంటి పైకప్పులు

రాయదుర్గం పట్టణం, కంబదూరు, కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో రెండ్రోజులుగా కురుస్తున్న వర్షానికి రాయదుర్గం పట్టణంలోని నేతాజి రోడ్డులోని రమేశ్‌కు చెందిన గార్మెంట్ దుకాణం, కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కంబదూరు మండలం అండేపల్లికి చెందిన మల్లేశ్ ఇంటి పైకప్పులు నేలకూలాయి. రమేశ్ పాత ఇంట్లో జీన్స్ ప్యాంట్లు కుట్టిస్తున్నాడు. అయిదు రోజులుగా కార్మికులు రాకపోవడంతో తెరవలేదు. వర్షానికి గురువారం సాయంత్రం ఒక్కసారిగా పైకప్పు కూలిపోయింది. తలుపులు తెరిచి చూస్తే సుమారు రూ.10 లక్షల విలువ చేసే ప్యాంట్లు తడిసిపోవడంతో పాటు మట్టి పడటంతో పాడైనట్లు బాధితుడు వాపోయాడు. మల్లేశ్ ఇంటి పైకప్పు కూలడంతో సమాగ్రి పూర్తిగా ధ్వంసమైంది. కళ్యాణదుర్గం పట్టణంలోని కన్నేపల్లి రోడ్డులోని సరోజమ్మ ఇల్లు వర్షానికి కూలింది. ఎలాంటి ప్రమాదం జరగలేదు.


రాయదుర్గం పట్టణం: కూలిన గార్మెంట్ దుకాణం పైకప్పు


కంబదూరు: అండేపల్లిలో నేల కూలిన ఇల్లు

ఎస్ఐగా నగేశ్ బాధ్యతలు

కుందుర్పి: కుందుర్పి ఎస్ఐగా నగేశ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లాలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మండలంలో శాంతిభద్రతలను కాపాడుతామన్నారు. ఎస్ఐకు మండల తెదేపా నాయకులు అభినందనలు తెలియజేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ వెంకటస్వామి గుంతకల్లుకు బదిలీ అయ్యారు.

జూదరుల అరెస్టు

ఉరవకొండ, న్యూస్‌టుడే: విడపనకల్లు మండలం గడేకల్లు శివారులో జూదం ఆడుతున్న ఐదుగురిని గురువారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఖాజాహుసేన్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.10,100 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. వారిని కోర్టులో హాజరు పరుచనున్నట్లు వివరించారు.


చదంలో తరగతి గదులను కూల్చిన అధికారులు

తరగతి గదుల కూల్చివేత


రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: తుపాను వల్ల శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోని తరగతి గదులను ఎంపీడీవో కొండన్న, రాయదుర్గం నియోజకవర్గం ప్రత్యేకాధికారి నాగేశ్వరరావు, ఎంఈఓ వెంకటరమేశ్‌గురువారం పొక్లెయిన్‌తో కూల్చివేశారు. మండలంలోని చదం, బీఎన్‌హళ్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలలో కూలడానికి సిద్ధంగా ఉన్న తరగతి గదులను గుర్తించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులకు ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా కూల్చివేసినట్లు అధికారులు తెలిపారు.

మడుగు కాదు.. రహదారే



బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: మండలంలోని లింగదహాళ్, కొలగానహళ్లి నుంచి కృష్ణాపురానికి హెచ్చెల్సీ కాలువపై వెళ్లే మట్టి రోడ్డు గుంతలు పడి అధ్వానంగా ఉంది. ప్రస్తుతం వర్షం కురుస్తుండటంతో వర్షపునీరు గుంతల్లో నిండి మడుగును తలపిస్తున్నాయి. కృష్ణాపురం నుంచి రోజు 80 మంది వరకు విద్యార్థులు లింగదహాళ్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు నడుచుకుంటూ వెళ్తున్నారు. ఈ రోడ్డులో ప్రయాణించాలంటే వాహన చోదకులు నానా అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారి మరమ్మతు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయితీ రాజ్ ఏఈఈ జగదీశ్ దృష్టికి తీసుకెళ్లగా.. పరిశీలించి మరమ్మతులకు ప్రతిపాదనలు పంపుతామన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



విడపనకల్లు మండలం పాల్తూరు సమీపంలో ఉరవకొండ రహదారి పక్కన విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు చేసిన స్తంభానికి పచ్చని తీగ నిండుగా అల్లుకుంది. తీగలకు, నియంత్రికకు చుట్టుకోవడంతో ప్రమాదకరంగా మారింది. తీగ వెంట విద్యుత్తు సరఫరా అయ్యే అవకాశం ఉంది. పొరబడితే ప్రమాదం తప్పదు. సంబంధిత అధికారులు గుర్తించి తీగను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. దీనిని విద్యుత్తు ఏఈఈ సత్యం దృష్టికి తీసుకెళ్లగా.. వెంటనే తీగను తొలగిస్తామన్నారు.

- న్యూస్‌టుడే, విడపనకల్లు (ఉరవకొండ)

శిథిలావస్థలో ఆర్టీసీ డిపో



రాయదుర్గం పట్టణంలోని ఆర్టీసీ డిపోను 1989లో నిర్మించారు. అప్పటి నుంచి పూర్తిస్థాయిలో కార్యకలాపాలు నిర్వహించకపోయినా డిపో నుంచి బస్సుల రాకపోకలు సాగుతున్నాయి. ప్రస్తుతం పక్కనే ఓ షెడ్‌లో కార్గో కార్యాలయం నడుస్తోంది. డిపో పైకప్పు పెచ్చులూడి కిందకు పడుతున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు డిపో ఆవరణమంతా కారుతుండటంతో నిలబడేందుకు కూడా చోటులేదు. ఈ విషయమై డిపో మేనేజర్ సురేశ్‌ను వివరణ కోరగా విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

- న్యూస్‌టుడే, రాయదుర్గం పట్టణం

ముళ్లదారితో అవస్థలు



కుందుర్పి మండల కేంద్రం నుంచి బి.కొత్తూరుకు వెళ్లే 8 కి.మీ. పంచాయితీ రాజ్ రహదారికి ఇరువైపులా ముళ్లపొదలు ఏపుగా పెరిగాయి. రహదారిలో మలుపులు కూడా అధికంగా ఉండటంతో ఆయా గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. సూచిక బోర్డులు లేక ప్రమాదాల బారిన పడుతున్నామన్నారు. మలుపులతో పాటు ముళ్లపొదలు ఏపుగా ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ముళ్లపొదలను తొలగించాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కుందుర్పి


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఎస్కేయూ, న్యూస్‌టుడే: భారత్ వికాస్ పరిషత్తు ఆధ్వర్యంలో ఈ నెల 20న కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి బృందగాన పోటీలకు అనంత విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ ఎంపిక పోటీలు గురువారం స్థానిక ఎస్ఎస్‌బీఎన్ కళాశాల ఆడిటోరియంలో జరిగాయి. సెయింట్‌మేరీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు భారత్ వికాస్ పరిషత్ నిర్వాహకులు సుంకు వేణుగోపాల్, అధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. న్యాయనిర్ణేతగా సంగీత కళాకారిణి ఉమా వ్యవహరించారు.

చిత్రలేఖనంలో ప్రావీణ్యం

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: చేతితో చిత్రాలు గీస్తూ ఓ విద్యార్థిని అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. పట్టణానికి చెందిన గిద్దలూరు మురళి, లక్ష్మి దంపతులకు ఇద్దరు పిల్లలు. మురళి ఎంఈవో కార్యాలయంలో ఒప్పంద ప్రాతిపదికన అటెండర్‌గా పనిచేస్తున్నారు. వీరి కుమారుడు కిశోర్ బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నారు. కుమార్తె నందిని ఇంటర్ పూర్తి చేసి, ఎల్ఎల్‌బీ మొదటి ఏడాది తిరుపతి ఎస్వీ విశ్వవిద్యాలయంలో చదువుతోంది. నందిని చదువుతో పాటు చిత్రాలు గీయడంతో ప్రావీణ్యం సాధించింది. పదో తరగతిలో ఒకేషనల్ ఉపాధ్యాయురాలు సూచనలతో చిత్రాలు గీస్తూ నేడు విభిన్న చిత్రాలతో అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. వివిధ కళారూపాలు, ప్రకృతి, దేవతల బొమ్మలే కాకుండా పండగలకు సంబంధించి చిత్రాలు గీస్తోంది. చేతి వృత్తి నేర్చుకోవాలనే తపనతో చిత్రాలు గీయడం అలవర్చుకున్నానని నందిని చెబుతోంది. ఇటీవల గీసిన ఆదియోగి, శివుడు, వినాయకుడు, నవరాత్రుల అమ్మవారి అలంకరణలు, గౌతమబుద్ధ, వేంకటేశ్వరస్వామి చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి.


చిత్రం గీస్తున్న నందిని


వేంకటేశ్వరస్వామి


కృష్ణుడు

19న చలో కలెక్టరేట్

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: ఏపీ చర్మ, డప్పుకళాకారుల సేవా సంఘం అధ్యక్షుడు బుల్లా రాజారావు ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన చర్మ, డప్పు కళాకారుల సమస్య పరిష్కారం కోసం 19న కలెక్టరేట్‌కు తరలిరావాలని ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు ఎం.మల్లేశ్ ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో చర్మ, డప్పు కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు చెప్పారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.లక్ష వరకు రాయితీ రుణం, ప్రతి మండల కేంద్రంలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల నుంచి చర్మకారులకు పాదరక్షలు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, కబేళా వృత్తిదారులకు ప్రత్యమ్నాయ వృత్తి కింద ఆర్థిక ప్యాకేజీ, అర్హులైన చర్మకారులు, డప్పు కళాకారులకు కొత్త పింఛను, లెదర్ పార్కుల నిర్మాణం, ఎస్సీ వర్గీకరణ అములు చేయాలని కోరుతూ వినతిపత్రం ఇవ్వనున్నట్లు వివరించారు.

శిక్షణ నుంచి మినహాయించాలని వినతి

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ఒకటి, రెండు తరగతులు బోధించే ఉపాధ్యాయులకు ఈ నెల 21 నుంచి రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. అయితే దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే ఉపాధ్యాయులు, బాలింతలు ఇతర సమస్యలతో ఇబ్బందిపడుతున్న ఉపాధ్యాయులను ఈ శిక్షణ నుంచి మినహాయించాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు డీఈవో వరలక్ష్మికి వినతి పత్రం సమర్పించారు.


కణేకల్లు: యర్రగుంట వద్ద తడిసిన మొక్కజొన్న పంటను చూపుతున్న రైతులు


రాయదుర్గం గ్రామీణం: తడిసిన ఉల్లిని శుభ్రం చేస్తున్న రైతులు

వర్షంతో పంటలకు నష్టం

తుపాను కారణంగా రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో రైతులు సాగు చేసిన వరి, మొక్కజొన్న, వేరుసెనగ, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. మబ్బులు ముసురుకొని తెరిపి లేకుండా కురిసిన వర్షానికి పలు పంటలు దెబ్బతిని రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వేరుసెనగ మొలకలు వస్తున్నాయని, మొక్కజొన్న కోసిన రైతులు తమ పంట దిగుబడులను కలాల్లో ఆరబోసుకుంటున్నారు. కాపుదశలో మిరప, టమాటా మచ్చలు ఏర్పడి దిగుబడి, కాయల నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దెబ్బతిన్న పంటలను గుర్తించి ప్రభుత్వం నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, బృందం


ఉరవకొండ: పాల్తూరు సమీపంలో మిరప పంటలో నిలిచిన నీరు

గుంతకల్లు
•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

అన్నక్యాంటీన్‌లో భోజన నాణ్యత పరిశీలన


క్యాంటీన్‌లో వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్ నయీం అహమ్మద్

గుంతకల్లు, న్యూస్‌టుడే: అన్నక్యాంటీన్‌లో భోజనం, ఫలాలు ఎలా ఉన్నాయో తమకు చెప్పాలని మున్సిపల్ కమిషనర్ నయీం అహమ్మద్ గురువారం ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. దీనిపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. క్యాంటీన్‌లో ఏవైనా సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. క్యాంటీన్‌లో వండే ఆహార పదార్థాలను తరచూ తనిఖీ చేస్తుంటామని ఆయన నిర్వాహకులను హెచ్చరించారు.

వర్షం వస్తే నడవలేం

లక్షుంపల్లిలో వర్షం వస్తే వచ్చిన గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నీరు నిల్వ ఉండి అటు ఇటు నడవలేని పరిస్థితి. అధికారులు సీసీరోడ్డు నిర్మించిన కాలువలు వేయకపోవడంతో నీరు రోడ్డుపైనే నిలిచి పోతోంది. క్రిష్టపాడు, తాడిపత్రికి వెళ్లాల్సిన మార్గంలో వెళ్లాలి. దీనిపై పంచాయతీ కార్యదర్శి వీరబాబు వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేలా చూస్తామని చెప్పారు. –న్యూస్‌టుడే, పెద్దవడుగూరు



తెలుగు అనువాద భగవద్గీత గ్రంథం ఆవిష్కరణ

పామిడి, న్యూస్‌టుడే: శ్రీసర్వ జ్ఞానేశ్వర్ 9, 12వ అధ్యాయాల తెలుగు అనువాద భగవద్గీత గ్రంథాన్ని పండరీపురం వార్కరి గురు పరంపర అధిపతి 8వ గురువు శ్రీగోపాల్ తుకారాం వాస్కర్ మహారాజ్ ఆవిష్కరించారు. గురువారం పట్టణంలోని నూతన పాండురంగస్వామి దేవాలయ ప్రాంగణంలో జ్ఞానేశ్వర్ మహారాజ్ సంస్కృత నుంచి మరాఠీలోకి అనువాదం చేసిన గ్రంథాన్ని రాష్ట్రంలోనే తొలిసారిగా ప్రతి ఇంట నిత్య పారాయణం, పూజలు జరగాలన్న సంకల్పంతో భావసార క్షత్రియ మండలి వారు తెలుగులోకి ముద్రించడం విశేషం. తొలుత గ్రంథ ప్రతులను భజనలతో గ్రామోత్సవం చేశారు. స్వామిజీ తొలి ప్రతిని డబ్బిడాం ఫర్మా అధ్యక్షుడు శ్రీనివాసరావుకు అందజేశారు. భజన సంఘం మాజీ కార్యదర్శి వేణుగోపాల్‌రావు గ్రంథ విశిష్టతను వివరించారు. భజన సంఘాల ప్రతినిధులు ముకుందరావు, రవీంద్రనాథ్, మురళీ, జగదీశ్, దత్తు, కుమార్ పాల్గొన్నారు.

ప్రయాణ ప్రాంగణం బాగు పడేదెన్నడు?

తాడిపత్రి, న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఆర్టీసీ బస్టాండుల్లో తాడిపత్రి ఒకటి. ఇక్కడి నుంచి అంతర్రాష్ట్ర, ఇతర రాష్ట్రాల్లోని పలు ప్రధాన పట్టణాలకు వేలసంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ ప్రయాణికులకు కనీస వసతులు కరవయ్యాయి. గత వైకాపా ప్రభుత్వంలో బస్టాండులో ఒక్క అభివృద్ధి పని చేసిన పాపాన పోలేదు.


బస్టాండు ప్రాంగణంలో పైకప్పు ఇనుప చువ్వలు కనబడుతున్న దృశ్యం

● తాడిపత్రి ఆర్టీసీ బస్టాండులో ఆర్టీసీ, అద్దె బస్సులు కలిసి 108 ఉన్నాయి. ఇందులో 400 మంది సిబ్బంది ఉండగా రోజువారి ఆదాయం రూ.14 లక్షల వరకు ఉంటోంది. ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించేందుకు నెలకు రూ.3.50 లక్షల వరకు ఖర్చు వస్తుందని అధికారులు చెబుతున్నారు. బస్టాండులో మాత్రం ఏళ్ల తరబడి ఎటువంటి అభివృద్ధి జరగలేదు.

● తాడిపత్రి నుంచి బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, తిరుపతి, విజయవాడ, కాకినాడ, బళ్లారి ఇంకా పలు ప్రధాన పట్టణాలకు బస్సులు రోజూ రాకపోకలు సాగిస్తుంటాయి. సుమారుగా 20వేల వరకు ప్రయాణికులు ఆర్టీసీ బస్సు సేవల్ని వినియోగించుకుంటున్నారు. ఆస్థాయిలో వారికి సౌకర్యాలు కల్పించడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.


బస్టాండు ఆవరణలో భారీగా పడిన గుంతలు

ఉన్నతాధికారులకు తెలియజేశాం

తాడిపత్రి ఆర్టీసీ బస్టాండు భవనం శిథిలావస్థకు చేరిందని, సీసీరోడ్డు ఏర్పాటు చేయాలని ఇదివరకే ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. ఇంకా ఎటువంటి పనులు మంజూరు కాలేదు. బస్టాండు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటాం. **-శంకర్, ఆర్టీసీ డీఎం, తాడిపత్రి**

సమస్యలివే..

● తాడిపత్రి బస్టాండు భవనం శిథిలావస్థకు చేరింది. ప్రయాణికులు కూర్చునే చోట, బస్సులు ఎక్కే వద్ద పైకప్పు పెచ్చులూడింది. గత ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. ఇటీవల బస్టాండు భవనం పైకప్పు పెచ్చులూడిందని, త్రుటిలో ప్రయాణికులు తప్పించుకున్నారని స్థానికులు చెబుతున్నారు.

● ఇప్పటి వరకు బస్టాండు ఆవరణ సీసీ రోడ్డుకు నోచుకోలేదు. ప్రాంగణమంతా ఎక్కడపడితే అక్కడ భారీగా గుంతలతో దర్శనమిస్తోంది. వాటిల్లో వర్షం నీరు చేరి నెలల తరబడి నిల్వ ఉంటోంది.

● తాడిపత్రి బస్టాండులో పారిశుద్ధ్యం పడకేసింది. ఆర్టీసీ బస్టాండ్ ముఖద్వారాల పక్కనే భారీగా చెత్తాచెదారం వేయడం, ఎక్కడపడితే అక్కడ మూత్ర విసర్జన చేయడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM to 1 PM)
గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 99897 94244

సమస్య: గుంతకల్లు ఆర్టీసీ బస్టాండు ఆవరణలో గుత్తి ప్లాట్ ఫారం వైపున ఖాళీస్థలంలో కొందరు మూత్ర విసర్జన చేస్తున్నారు. **-ఓబులేసు, ప్రయాణికుడు**

సమాధానం : బ్లీచింగ్ పొడి చల్లించి సమస్యను పరిష్కరిస్తాం **- ఖాజాహుస్సేన్, అడ్మిన్, 9వవార్డు సచివాలయం**

–న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

సమస్య : ఆకులేడు ప్రధాన రోడ్డుకు ముళ్ల పొదలు పెరిగి పోయాయి. **- వెంకటనారాయణ, ఆకులేడు**

సమాధానం : గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసి సమస్యను పరిష్కరిస్తాం. **- నిర్మలకుమారి, ఎమ్పీడీవో**

సమస్య : పెద్దజలాలపురంలో పాఠశాల వద్ద శుభ్రత లేదు. **- ఆదెప్ప**

సమాధానం : సమస్యను పరిష్కరిస్తాం. **- నరసింహరాజు, ఎంఈవో**

–న్యూస్‌టుడే, శింగనమల

గుత్తిలో అన్నక్యాంటీన్ ప్రారంభం


అన్నక్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తిలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద ఏర్పాటు చేసిన అన్నక్యాంటీన్‌ను గురువారం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ప్రారంభించారు. ప్రజలకు అల్పాహారాన్ని వడ్డించారు. తెదేపా నాయకులు గుమ్మనూరు నారాయణ, ఎంకే చౌదరి, శ్రీకాంత్‌చౌదరి, టైటర్‌బాషా, రవితేజ నారాయణస్వామి, ధర్మాపురం, కరిడికొండ మాజీ సర్పంచులు శ్రీనివాసచౌదరి, వెంకట్రాముడు పాల్గొన్నారు.


గుంతకల్లు : వాల్మీకి జయంతిలో పాల్గొన్న తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు జితేంద్రగౌడ్


తాడిపత్రి : వాల్మీకి విగ్రహ పూజల్లో పాల్గొన్న మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి


పాతగుంతకల్లు: వేడుకల్లో పాల్గొన్న తెదేపా నాయకులు నారాయణస్వామి, బండారు ఆనంద్ తదితరులు

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

గుంతకల్లు, శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో గురువారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటాలను మేళతాళాల నడుమ ఊరేగించారు. ఆయా వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, వాల్మీకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. –న్యూస్‌టుడే బృందం


పామిడి: కార్యక్రమంలో పాల్గొన్న వాల్మీకి సోదరులు


రాయలచెరువులో వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ



గుత్తిలో.. నివాళి అర్పిస్తున్న పెన్షనర్లు


పెద్దవడుగూరులో..

సాగునీటి సమస్య తీర్చండి

శింగనమల, గార్లదిన్నె గ్రామీణ, గుంతకల్లు, పామిడి, న్యూస్‌టుడే : జిల్లాలో సాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. కల్లుమడి, తరిమెల, నిదనవాడ గ్రామాల్లో గురువారం బస్సుయాత్ర నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ మాట్లాడుతూ ఎగువన తుంగభద్ర డ్యాం, దిగువన శ్రీశైలం డ్యాం ఉన్నా జిల్లాలో సాగునీటి సమస్య తీరలేదన్నారు. జిల్లా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. నాయకులు భాస్కర్, రైతు సంఘం నాయకులు చంద్రశేఖర్, కృష్ణమూర్తి, నాగరాజు, సావిత్రి, శ్రీనివాసులు పాల్గొన్నారు. ● గార్లదిన్నె మండల పరిధిలోని కల్లూరు, ఇల్లూరు గ్రామాల్లోనూ బస్సు యాత్ర సాగింది. ● గుంతకల్లు మండలంలోని పులగుట్టపల్లి, దొనిముక్కల, నెలగొండ నాగసముద్రం అయ్యవారిపల్లి గ్రామాల్లో చెరువులను సీపీఎం నాయకులు పరిశీలించారు. పామిడిలోనూ బస్సు యాత్ర కొనసాగింది. 21న సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామన్నారు.

నిబంధనలు పాటించాలి

యాడికి, న్యూస్‌టుడే: దీపావళీ పండగ సందర్భంగా బాణసంచా విక్రయదారులు నిబంధనలను తప్పక పాటించాలని తహసీల్దారు ప్రతాప్‌రెడ్డి సూచించారు. బాణసంచా దుకాణాల కోసం యాడికిలో ఐదుగురు, రాయలచెరువులో ముగ్గురు తాత్కాలిక అనుమతులు పొందారు. వీరికి రెవెన్యూ కార్యాలయంలో రెవెన్యూ, అగ్నిమాపకం, విద్యుత్తు, పోలీస్‌శాఖ అధికారుల సంయుక్త పర్యవేక్షణలో అవగాహన కల్పించారు. సీఐ ఈరన్న, ఎస్సై మోహన్‌బాబు, ఏల్‌ఏం నాగేంద్ర, ఉప తహసీల్దారు శ్రీనివాసులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

యాడికి, న్యూస్‌టుడే: యాడికి మండలంలోని రెండు గ్రామ పంచాయతీల్లో గురువారం 'పల్లె పండగ' కార్యక్రమాలు నిర్వహించారు. యాడికి పంచాయితీలోని పెద్దపేటలో రూ.2.3లక్షలతో పశువుల పాక, కమలపాడులో రూ.3.5లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణం పనులకు అధికారులు భూమిపూజ చేశారు. ఎంపీడీఓ వీరరాజు, ఈఓఆర్డీ శశికళ, ఏపీఓ రమేశ్, ఏఈ యల్లమనాయుడు తెదేపా నాయకులు బయపరెడ్డి పాల్గొన్నారు.

అక్రమ భూకేటాయింపుపై విచారణ

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రి మున్సిపాలిటీకి చెందిన స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడంపై రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. 2012లో పురపాలక సంఘం ఇన్‌ఛార్జి కమిషనర్‌గా ఉన్న డీఈ కె.జయభారత్‌రెడ్డి నిబంధనలకు విరుద్ధంగా 25.09 ఎకరాల మున్సిపాలిటీ భూమిని ఓ వ్యక్తికి కేటాయించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ అంశంపై విచారణ చేయడానికి మున్సిపల్ ఆర్డీ విశ్వనాథను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం జీవో జారీ చేసింది.

నగదు, చరవాణితో యువకుడి పరారీ

గార్లదిన్నె, న్యూస్‌టుడే : కూలీ పనికోసం గార్లదిన్నెకు వలస వచ్చిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన మంగల్ అనే యువకుడు రూ.20 వేలు నగదు, చరవాణి తీసుకొని పారిపోయాడని బాధితులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గార్లదిన్నెలో డ్యామ్ రోడ్డు సమీపంలో పానీపూరి బండి నడుపుకొంటున్న ఒడిస్సాకు చెందిన వ్యక్తి దగ్గర కూలీ పనులు చేసుకుంటూ ఉండేవాడు. రెండు రోజుల కిందట నగదు, చరవాణి తీసుకొని వెళ్లిపోవడంతో గురువారం పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు.

రహదారిపై కుంగిన కల్వర్టు



గుంతకల్లులోని మండి బజారులో కల్వర్టు కుంగింది. మండి బజారు నుంచి కెనరా బ్యాంక్‌కు వెళ్లే వీధి క్రాస్‌లో మురుగు కాలువపై ఉన్న కాంక్రీట్ దిమ్మెలు దెబ్బతిని లోనికి కుంగిపోయాయి. నాలుగు చక్రాల వాహనం వెళ్లడానికి ఇబ్బందికరంగా మారింది. కొత్త కల్వర్టు నిర్మాణం చేపట్టాలని వాహన చోదకులు మున్సిపల్ ఇంజినీర్లను కోరుతున్నారు. –న్యూస్‌టుడే, గుంతకల్లు

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: పెద్దవడుగూరుకు చెందిన మహమ్మద్‌గౌస్ అనే విద్యార్థి కొన్ని నెలల కిందట అనారోగ్య కారణాలతో మృతిచెందాడు. దీంతో 1983-84వ సంవత్సరం చదివిన పూర్వపు విద్యార్థులు కలిసి స్నేహితుడి కుటుంబానికి గురువారం రూ.25 వేల వరకు ఆర్థిక సాయం అందజేశారు. వీరు ఈనెల 6న పూర్వపు విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేసి మిత్రులంతా నగదు సేకరించారు. అనంతరం మృతుడి భార్యకు పూర్వ విద్యార్థులు రమణారెడ్డి, చౌడేశ్వరయ్య, జంగంశ్రీనివాసులు, రామమోహన్‌ఆచారి, పెద్దవీరయ్యాచారి, వెంకటరెడ్డి నగదు అందజేశారు.

ప్రగతి పనులకు శ్రీకారం


బూదేడులో భూమి పూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే : మండల పరిధిలోని బూదేడు, బి.క్రిష్టాపురం, ముకుందాపురం పంచాయతీల్లో గురువారం పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. బూదేడులో రూ.15లక్షలు, క్రిష్టాపురంలో రూ.10 లక్షలు, ముకుందాపురంలో రూ.10లక్షలతో సీసీరోడ్డు పనులకు సర్పంచులు, అధికారులు, తెదేపా నాయకులు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు శివాంజనేయులు, హిమకుమారి, ఎంపీడీవో యోగానందరెడ్డి, ఈవోఆర్డీ దామోదరమ్మ, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

శుభ్రత పాటించకపోతే ఊరుకోం : జేసీ

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రి పురపాలికలో ఉన్న కోడి, పొటేలు మాంసం విక్రయ దుకాణాల వద్ద ఎటువంటి చెత్త కనిపించినా షట్టర్ వేస్తామని మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయా దుకాణాదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి తరువాత ప్రతి దుకాణాన్ని పరిశీలిస్తామని, అప్పుడు అపరిశుభ్రంగా ఉందని గుర్తిస్తే చర్యలు తప్పవన్నారు. తాడిపత్రిలో ఉంటూ వ్యాపారంతో అభివృద్ధి అవ్వడమే కాకుండా పురపాలిక బాగుపడేందుకు కృషి చేయాలన్నారు.

ద్విచక్ర వాహనాలు సీజ్

నార్పల, న్యూస్‌టుడే : నార్పల మేజర్ పంచాయతీలోని సీపీఐ, చైతన్య కాలనీల్లో ఎలాంటి పత్రాలు లేని 15 ద్విచక్రవాహనాలను సీఐ కౌలుట్లయ్య, ఎస్సై సాగర్ సీజ్ చేశారు. ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు గురువారం నార్పలలో కాలనీల్లో తనిఖీలు నిర్వహించారు.

క్రీడా మైదానాలు కరవు

☛ రాళ్లు, గుట్టల మధ్యే సాధన
☛ విద్యార్థులకు తప్పని పాట్లు

● ఉన్నత పాఠశాలలు	:	34
● కేజీబీవీలు	:	6
● ఆట స్థలం ఉన్నవి	:	21
● ఆట స్థలం లేనివి	:	19

శింగనమల, నార్పల, న్యూస్‌టుడే : గత వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో గ్రామీణ క్రీడాకారులకు ఆట స్థలం కరవైంది. క్రీడ స్ఫూర్తిని చాటి చెప్పే విద్యార్థులకు మైదానాలు లేక అవస్థలు పడుతున్నారు. నాడు - నేడు పేరుతో రూ.కోట్లు ఖర్చు చేశారు. ఆ పాఠశాలల్లోని క్రీడా మైదానాలను మాత్రం విస్మరించారు. చాలా పాఠశాలల్లో మైదానాలు లేక విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు.

క్షేత్రస్థాయిలో ఎక్కడెక్కడంటే?

● శింగనమల నియోజకవర్గంలో ఉన్నత, కస్తూర్బా, ఆదర్శ పాఠశాలు 40 ఉన్నాయి. వీటిలో దాదాపు 1,520 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆయా పాఠశాలల్లో 19 పాఠశాలల్లో విద్యార్థులకు ఆట స్థలం లేదు.

● శింగనమల మండలంలో 9 ఉన్నత పాఠశాలు ఉన్నాయి. వీటిలో ఆరు పాఠశాలలకు క్రీడ మైదానం లేదు. సలకంచెరువు ఉన్నత పాఠశాల క్రీడామైదానం కొండగుట్టల మధ్య ఉంది. ఆకులేడు, తరిమెల, పెరవలి ఉన్నత పాఠశాలల్లో ఆట స్థలం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

● బుక్కరాయసముద్రం మండలంలో ఆరు ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. కస్తూర్బా పాఠశాలలో ఉన్నత పాఠశాల, ఇంటర్ విద్యార్థులు చదువుతున్నారు. 250 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో ఉన్న క్రీడామైదానం ముళ్ల పొదలతో నిండి పోయింది. ఎకరా స్థలం ఉన్నా ఎలాంటి ప్రయోజనం లేకుండాపోయింది.

● వెంకటాపురం, సిద్ధరాపురం పాఠశాలల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది.

● నార్పల మండలంలో ఏడు ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో నార్పల బాలికల పాఠశాల, కేజీబీవీ పాఠశాలకు ఆట స్థలం లేదు.

● గార్లదిన్నె మండలంలోని 9 ఉన్నత పాఠశాలలు ఉంటే వాటిలో బి.కృష్ణాపురం, కొప్పలకొండ, కల్లూరు, కేజీబీవీ పాఠశాలలకు క్రీడమైదానం కరవైంది. క్రీడల్లో ప్రతిభ కలిగిన విద్యార్థులు ఉన్న మైదానం లేక ముందుకు వెళ్లలేక పోతున్నారు.

● పుట్లూరు మండలంలో 7 ఉన్నత పాఠశాలలకుగాను కేవలం మూడింటికి మాత్రమే క్రీడామైదానం ఉంది. కడవకల్లు, యల్లుట్ల, కేజీబీవీ పాఠశాలలకు క్రీడల సాధనకు స్థలం లేదని విద్యార్థులు వాపోతున్నారు.



ఇక్కడ కనిపిస్తున్న గుట్ట ప్రాంతం శింగనమల మండలం సలకంచెరువు ఉన్నత పాఠశాల క్రీడా మైదానం. 196 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలకు ఆట స్థలం లేదు. నాడు -నేడు కింద రూ. 60లక్షలు ఖర్చు చేసిన వైకాపా ప్రభుత్వం క్రీడా మైదాన్ని పట్టించుకోలేదు. ఇక్కడ ప్రతిభ గల క్రీడాకారులున్నా.. సాధన చేసేందుకు అనువైన క్రీడాప్రాంగణం లేదు.

ప్రతిపాదనలు పంపాం

ఆట స్థలం లేని లేని పాఠశాలలను గుర్తించాం. ఆయా పాఠశాలలకు ఆట స్థలం అవసరమని ప్రతిపాదనలు చేశాం. ప్రభుత్వ అనుమతులు రాగానే విద్యార్థులకు ఆట స్థలాలు ఏర్పాటు చేయిస్తాం. **- నరసింహరాజు, ఎంఈవో, శింగనమల**

అనంతపురం

•అనంతపురం •రాప్తాడు

'విజయవాడ కేంద్రంగా హజ్ యాత్రకు అవకాశం కల్పించాలి'

అశోక్‌నగర్, న్యూస్‌టుడే: విజయవాడ కేంద్రంగా హజ్‌యాత్రకు వెళ్లే విధంగా వెసులుబాటు కల్పిస్తే అదనపు భారం తగ్గుతుందని మేయర్ వసీం, మైనార్టీ కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్, ఇషాక్, రహంతుల్లా కోరారు. గురువారం వైకాపా జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ ఉండటంతో అక్కడి నుంచి వెళ్లేవారన్నారు. ఎక్కువగా 50ఏళ్లకు పైగా వయస్సు ఉన్న వారే హజ్ యాత్రకు వెళుతుంటారని, గతంలో రూ.83వేలు భారం అవుతుండటంతో ప్రభుత్వమే భరించేదన్నారు. తాజాగా అదే తరహాలో కూటమి ప్రభుత్వం భరించాలని వారు డిమాండ్ చేశారు. మైనార్టీలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


భారత్ వికాస్ పరిషత్తు ప్రతినిధులతో విద్యార్థినులు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: భారత్ వికాస్ పరిషత్తు ఆధ్వర్యంలో ఈ నెల 20న కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి బృంద గాన పోటీలకు అనంత విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ ఎంపిక పోటీలను గురువారం స్థానిక ఎస్ఎస్‌బీఎన్ కళాశాల ఆడిటోరియంలో జరిగాయి. సెయింట్‌మేరీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు భారత్ వికాస్ పరిషత్ నిర్వాహకులు సుంకు వేణుగోపాల్, అధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. న్యాయనిర్ణేతగా సంగీత కళాకారిణి ఉమా వ్యవహరించారు. కార్యక్రమంలో కార్యదర్శి హరికృష్ణ, ప్రతినిధులు పాల్గొన్నారు.


నృత్యం చేస్తున్న చిన్నారులు

ఆకట్టుకున్న రామాయణ నృత్యరూపకం

అశోక్‌నగర్(అనంత సంక్షేమం), న్యూస్‌టుడే: అనంతపురంలో నిర్వహించిన మహర్షి వాల్మీకి రాష్ట్రస్థాయి జయంతి ఉత్సవాల్లో చిన్నారుల నాటికలు ఆలోచింపజేశాయి. నృత్యాలు వీక్షకులను కట్టి పడేశాయి. రామాయణ నృత్య రూపకం, సీతా స్వయంవరం, రాముడు అరణ్యవాసానికి వెళ్లే నాటిక కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. కృషి ఉంటే మనిషి రుషి అవుతాడంటూ ఓ వైపు పాట పాడుతుండగా.. మరో వైపు వాల్మీకి వేషధారి విల్లుతో వేటాడటం.. ఆతర్వాత వాల్మీకిగా మారి రామాయణం రచించే ఘట్టాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి హాజరైన అతిథులు చిన్నారులకు జ్ఞాపికలు అందజేసి అభినందించారు.


స్వయంవరం నాటకంలో శివధనస్సు విరుస్తున్న రాముడు వేషధారి

'పీజీ ప్రవేశాలు కల్పించాలి'

ఎస్కేయూ, న్యూస్‌టుడే: పీజీసెట్‌లో అర్హతతో సంబంధం లేకుండా డిగ్రీ ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ పీజీ ప్రవేశాలు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వారు ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేశ్ బాబుకు వినతి పత్రం సమర్పించారు.

శిక్షణ నుంచి మినహాయించాలని వినతి

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ఒకటి, రెండు తరగతులు బోధించే ఉపాధ్యాయులకు ఈ నెల 21 నుంచి రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. అయితే దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే ఉపాధ్యాయులు, బాలింతలను ఈ శిక్షణ నుంచి మినహాయించాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు డీఈవో వరలక్ష్మికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో నరసింహులు, సిరాజుద్దీన్, సతీశ్, సర్దార్‌వలి, వెంకటరమణ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

రాప్తాడు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని పండమేటిరాయుడు ఆలయ కమిటీని గురువారం గ్రామస్థుల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా ఆంజనేయ వెంకట్రాముడు, వైస్ ఛైర్మన్‌గా లక్ష్మయ్యతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు నూతన సభ్యులను శాలువాలతో సన్మానించారు.


తెరపై ఈనాడు

కమలానగర్, న్యూస్‌టుడే: గంగ: వీక్షణం, **గాయత్రి:** మార్టిన్, **గౌతమి:** జనక అయితే గనక, **గౌరి, ఎస్వీ సినిమాక్స్:** దేవర, **తరంగిణి:** విశ్వం, **తేజస్విని:** లవ్‌రెడ్డి, **త్రివేణి, నీలిమ:** వేట్టయాన్, **సుధా:** ఇద్దరు.

> వాణిజ్య పన్నులశాఖ అధికారి ఒకరు నగరంలోని టవర్‌క్లాక్ వద్ద తోపుడు బండిపై కిలో యాపిల్ పండ్లను రూ.120కు కొనుగోలు చేశారు. మరొక దుకాణంలో వాటికి తూకం వేయగా 800 గ్రాములు బరువున్నాయి. కిలోకు 200 గ్రాములు తక్కువ రావడంతో అవాక్కయ్యారు.

> నగరంలోని కిరాణ వ్యాపారి ఒకరు టోకు వ్యాపారి వద్ద 15 లీటర్ల పామాయిల్ ప్యాకెట్లు ఉన్న పెట్టెను రూ.1,800తో కొన్నారు. అంటే లీటరు ధర రూ.120. వాస్తవంగా లీటరు పామాయిల్ ప్యాకెట్‌పై గరిష్ఠ అమ్మకం ధర రూ.108 ముద్రించి ఉంది. దాన్ని ఎక్కువ ధరకు ఎలా అమ్మాలో తెలియక కిరాణ వ్యాపారి అయోమయంలో పడిపోయాడు.

ధరల్లో వ్యత్యాసం..



తూకాల్లో మోసం

• వ్యాపారుల దోపిడీకి అడ్డుకట్ట ఏదీ?

అరవిందనగర్(అనంతపురం), న్యూస్‌టుడే: అనంత నగరంలోని సూపర్ మార్కెట్ల నిర్వాహకులు కొందరు వినియోగదారులను ఆకర్షించేలా నిత్యావసర సరకులను ఆకర్షణీయమైన పొట్లాల్లో ప్యాక్ చేసి అమ్ముతున్నారు. నిబంధనల ప్రకారం పొట్లాల్లో సరకులు ప్యాక్ చేయడానికి లీగల్ మెట్రాలజీ అధికారుల అనుమతి తీసుకోవాలి. అలా కాకుండా ఇష్టారాజ్యంగా వ్యాపారాలు సాగిస్తున్నారు. పొట్లంపై ధర, తయారీ తేదీ, వినియోగదారుడు ఫిర్యాదు చేయడానికి ఈ మెయిల్, తయారీదారుడి వివరాలు ఏమీ ముద్రించకుండా అమ్ముతున్నట్లు లీగల్ మెట్రాలజీ అధికారులు జరిపిన తనిఖీలో తేలింది. నిత్యం ఇలాంటి మోసాలు వెలుగు చూస్తున్నా.. ఫిర్యాదు చేస్తున్న వారు కొందరే. వినియోగదారుల్లో చైతన్యం అవసరమని అధికారులు చెబుతున్నారు.

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

కొనుగోలు చేసిన దానికి బిల్లు తీసుకోవాలి. తూకం చూడాలి. పొట్లంపై ధర, సరకు నాణ్యత, తయారీదారు, తేదీ, ఈ మెయిల్, ఫోన్ నంబరు తదితర వివరాలు చూసుకోవాలి. తేడా ఉంటే సంబంధిత అధికారి లేదా టోల్ ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయాలి.

ఈ నంబర్లకు ఫిర్యాదు చేయండి

✦ సహాయ నియంత్రణ అధికారి : 98490 95707
✦ అనంతపురం డివిజన్ అధికారి: 93981 12675
✦ టోల్‌ఫ్రీ నంబరు: 1800 425 4202

గత నెలలో తనిఖీలు.. నమోదు చేసిన కేసులు


తూకాన్ని పరిశీలిస్తున్న తూ.కొ. తనిఖీ అధికారి మహమ్మద్ గౌస్

✤ రాంనగర్‌లోని డీకే ఎంటర్‌ప్రైజెస్(సూపర్ మార్కెట్)లో అధికారులు తనిఖీలు చేసి పలు లోపాలు గుర్తించారు. ప్యాకింగ్ చేయడానికి అనుమతి తీసుకోలేదని, సరకుల పొట్లాలపై వివరాలు, లేబుల్ ముద్రణలో లోపాలు, వివరాలు లేని సరకుల విక్రయిస్తున్నట్లు గుర్తించారు. మొత్తం 5 కేసులు నమోదు చేసి, రూ.35 వేలు జరిమానా విధించారు.

✤ మొబైల్ డెలివరీ యూనిట్(ఎండీయూ) ఆపరేటర్ ఒకరు తక్కువ తూకంతో బియ్యం పంపిణీ చేస్తున్నట్లు గుర్తించి, రూ.4 వేలు జరిమానా విధించారు.

✤ నగరంలోని గుజిరీ దుకాణ వ్యాపారి ఒకరు త్రాసుకు ముద్ర వేయించలేదని, తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించి రూ.15 వేలు జరిమానా విధించారు.

✤ తాడిపత్రి రోడ్డులోని గాయత్రిమిల్క్ నిర్వాహకులు సరకుల పొట్లాలపై వివరాలు (డిక్లరేషన్) ముద్రించకుండా అమ్ముతున్నట్లు గుర్తించి, రూ.25 వేలు జరిమానా వసూలు చేశారు.

✤ నగరంలోని పలు కూడళ్లలో తోపుడు బండ్లపై పండ్లు విక్రయిస్తున్న వ్యాపారుల త్రాసులు, తూకాలు పరిశీలించామని లీగల్ మెట్రాలజీ అనంతపురం డివిజన్ తనిఖీ అధికారి మహమ్మద్ గౌస్ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

అనంత నగరపాలక: 8008573011, రూరల్: 8008573010, రుద్రంపేట: 9989195979, ఎస్కేయూ: 8008573005, రాప్తాడు: 6304766286, ఆత్మకూరు: 7995067003

సమస్య: మాయవతి కాలనీలో, చంద్రబాబునగర్‌లో వీధి దీపాలు వెలగడం లేదు. **- పద్మావతి, వెంకటేశ్**
సమాధానం: మరమ్మతులు చేయించి వీధి దీపాలు వెలిగేలా చూస్తాం. **- హిదయతుల్లా, పంచాయతీ కార్యదర్శి**
సమస్య: నగరంలోని మహాత్మాగాంధీ కాలనీ సత్యసాయి వృద్ధాశ్రమం పక్క వీధిలో డోరు నంబరు 13/1/626 వద్ద మూడో స్తంభానికి ఉన్న లైటు వెలగడం లేదు. **- నాగేశప్ప**
సమాధానం: లైటు వెలిగేలా చర్యలు తీసుకుంటాం.
సమస్య: రాంనగర్ 80 అడుగుల రోడ్డులో చెత్తను తొలగించాలి. **- సాయి**
సమాధానం: శుభ్రం చేయిస్తాం.
(పై ప్రశ్నలకు నగరపాలక డీఈ దాక్షాయిణి, ప్రజారోగ్య అధికారి విష్ణుమూర్తి సమాధానాలు ఇచ్చారు.) - న్యూస్‌టుడే, అశోక్‌నగర్

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతం


వ్రతం నిర్వహిస్తున్న వేద పండితులు

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే: నగరంలోని బెంగళూరు రోడ్డులో ఉన్న శివకోటి శ్రీపీఠంలో సత్యనారాయణ వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం రాత్రి అశ్వయుజ పౌర్ణమి సందర్భంగా వ్రతం చేశారు. వేద పండితులు వ్రతం ఆవశ్యకతను వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామాల్లో రోడ్ల నిర్మాణమే లక్ష్యం

రాప్తాడు, న్యూస్‌టుడే: ప్రతి గ్రామంలో రోడ్లు వేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా గురువారం ఆమె మండలంలోని గొందిరెడ్డిపల్లి, పుల్లలరేవు గ్రామాల్లో పర్యటించారు. గొందిరెడ్డిపల్లి గ్రామస్థులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా పంచాయతీ కేంద్రంలో రూ.14.50లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. రూ.లక్ష సొంత నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. పుల్లలరేవులో సీసీ రోడ్లు, గోకులం షెడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులు పలువురు పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాల సమస్యలను ఆమె దృష్టికి తీసుకురాగా వాటన్నింటినీ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రాప్తాడు మండల తెదేపా ఇన్‌ఛార్జి ధర్మవరపు మురళీ, కన్వీనర్ కొండప్ప, శ్రీనివాసులు, సర్పంచి శీనయ్య, పుల్లలరేవు సాయినాథ్, ఎంపీటీసీ సభ్యుడు జాఫర్, తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీఓ విజయలక్ష్మీ పాల్గొన్నారు.


భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీత, ధర్మవరపు మురళీ, అధికారులు

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు నాశనం


ప్రశంసా పత్రాలు అందుకుంటున్న యువత

తపోవనం(అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాల మత్తు నుంచి యువతకు విముక్తి కల్పించాలని ఎస్కేయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త మురళీధర్‌రావు కోరారు. ఎంతోమంది యువత మాదక ద్రవ్యాలకు అలవాటుపడి ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో గురువారం మాదక ద్రవ్యాలపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీనివాసులు, ఆర్ట్స్ కళాశాల జంతుశాస్త్ర అధ్యాపకుడు ఎల్ఎన్ ప్రసాద్, యువకేంద్ర కార్యక్రమ బాధ్యుడు జి.శ్రీనివాసులు, మానసిక వైద్య నిపుణులు జి.బాలాజీ, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జీవన్‌కుమార్, కేంద్రీయ విద్యాలయ అధ్యాపకురాలు ప్రణతి తదితరులు హాజరై ప్రసంగించారు. తొలుత వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మత్తు పదార్థాలకు బానిస కాకుండా యువతలో చైతన్యం రగిలించాలని పిలుపునిచ్చారు. అనంతరం పలువురికి ప్రశంసా పత్రాలు అందజేశారు.


వాల్మీకి చిత్రపటానికి పుష్పాలతో నివాళి అర్పిస్తున్న ఎస్పీ జగదీశ్


జేడీపీ కార్యాలయంలో..


వాల్మీకి విగ్రహం వద్ద జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం తదితరులు


రాప్తాడులో..

ఆదర్శనీయులు వాల్మీకి

మహర్షి వాల్మీకి అన్ని వర్గాల వారికి ఆదర్శప్రాయుడని వక్తలు అన్నారు. గురువారం వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.
- న్యూస్‌టుడే బృందం


జేఎన్‌టీయూలో నివాళి అర్పిస్తున్న ఇన్‌ఛార్జి వీసీ సుదర్శనరావు తదితరులు


మాట్లాడుతున్న ఎస్కేయూ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య అనిత


డీఎంహెచ్‌వో డాక్టర్ ఈ.బి.దేవి, ఉద్యోగులు

ట్రాఫిక్ ఉల్లంఘనలపై ఉక్కుపాదం

అనంత నేరవార్తలు: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. పోలీసులు గురువారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఎక్కువ శబ్దాల హారన్‌లు వినియోగిస్తున్న 50 ఆటోలను పట్టుకున్నారు. వాటిని తొలగించారు. అధిక శబ్దం సైలెన్సర్లతో తిరుగుతున్న బుల్లెట్ వాహనాలనూ పట్టుకుని స్టేషనుకు తరలించారు. వారికి ట్రాఫిక్ సీఐ రఘుప్రసాద్ జరిమానా విధించి హెచ్చరిక చేశారు.

13 ఏళ్ల తర్వాత..

• కుటుంబాన్ని కలుసుకున్న అనంత జిల్లా వాసి



ఆర్కేనగర్, న్యూస్‌టుడే: మతిస్థిమితం కోల్పోయిన ఓ వ్యక్తి 13ఏళ్ల తర్వాత కుటుంబాన్ని కలుసుకున్నాడు. తమిళనాడు రాష్ట్రం తంజావూర్ జిల్లా కలెక్టర్ ప్రియాంక పంకజం మతిస్థిమితంలేని బాధితుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. వారిని కాపాడి చికిత్స అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ క్రమంలో పూదలూర్ సెంగిపట్టి ప్రాంతంలో 40ఏళ్ల వ్యక్తి మతిస్థిమితం లేకుండా తిరుగుతూ కనిపించాడు. అతన్ని ఆస్పత్రిలోని ప్రత్యేక కేంద్రానికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు మందులు తీసుకున్నాడు. తెలుగులో మాట్లాడుతుండటంతో ఏ ప్రాంతానికి చెందినవారో తెలుసుకోలేకపోయారు. నెల తర్వాత తెలుగు తెలిసిన మహిళ ద్వారా వివరాలు సేకరించారు. అతని పేరు ప్రసాద్ అని, అనంతపురం జిల్లాకు చెందినవాడని గుర్తించి అక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారి ద్వారా సమాచారం అందుకున్న కుటుంబీకులు బుధవారం తంజావూర్ కలెక్టరేట్‌కు వచ్చారు. ప్రసాద్‌ను కుటుంబీకులకు కలెక్టర్ అప్పగించారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: నగరంలోని రుద్రంపేటలో నాల్గో పట్టణ, స్పెషల్ బ్రాంచి పోలీసులు గురువారం ఓ వ్యభిచార గృహంపై దాడి చేశారు. మధ్యవర్తితోపాటు విటుడు, బాధితురాలు పట్టుబడ్డారు. గత కొన్ని నెలలుగా ఆ ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం జరుగుతోంది. రాత్రివేళ విటులు స్థానికంగా ఉన్న ఇళ్ల తలుపులు కొట్టేవారని తెలిసింది. ఈ విషయంపై స్థానికులు పలుమార్లు హెచ్చరించినా పట్టించుకోక పోవడంతో పోలీసులను సంప్రదించారు. గృహంపై నిఘా ఉంచిన పోలీసులు గురువారం సాయంత్రం మెరుపుదాడులు చేశారు. పట్టుబడిన వారిని నాల్గో పట్టణ పోలీసుస్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేశారు.

చిత్తడి దారుల్లో చిరాకు



వర్షాలకు నగరంలోని రహదారులు దెబ్బతిన్నాయి. రామచంద్రనగర్ నుంచి తపోవనం వైపు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. ప్రశాంతినగర్ బోర్డు వద్ద వంద మీటర్ల మేర సిమెంటు రోడ్డు నిర్మించినప్పటికీ మిగతా దారి మొత్తం గుంతల మయంగా మారింది. సోమనాథనగర్, యువజన కాలనీల్లో పరిస్థితి దారుణంగా ఉంది. గుంతల్లో వర్షం నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు గుర్తించలేకపోతున్నారు. ఫలితంగా కిందపడుతున్నారు. సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టాలని నగరవాసులు కోరుతున్నారు. **- ఆజాద్‌నగర్(అనంతపురం)**

రహదారి.. ప్రతిపాదనలకే సరి

రుద్రంపేట పంచాయతీ పరిధిలోని మాయావతి కాలనీ ఏర్పడి దశాబ్దాలు గడిచినా రహదారి నిర్మాణానికి నోచుకోలేదు. ఇక్కడ సుమారు 130 కుటుంబాలు నివసిస్తున్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టాలని పాలకులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా.. ప్రతిపాదనలతో సరిపెడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. వర్షం వచ్చినప్పుడు ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి హిదయతుల్లా మాట్లాడుతూ ప్రతిపాదనలు తయారు చేసి రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు. **- రుద్రంపేట**



ట్రాఫిక్ కష్టాలు తీరేదెన్నడు?



నగరంలోని పలు కూడళ్లలో నిత్యం ట్రాఫిక్ అంతరాయంతో వాహనదారులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఆర్టీసీ బస్టాండ్ లోపలి నుంచి బస్సులు బయటకు వచ్చే సమయంలో శ్రీకంఠం సర్కిల్ వైపు నుంచి వచ్చే వాహనాలు నిలుపడం లేదు. దాంతో బస్సులను తిప్పుకోవటం కష్టతరంగా మారుతుంది. దాంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. ఆ ప్రాంతంలో పోలీసు సిబ్బందిని నియమిస్తే సమస్య తీరుతుంది. ఆదిశగా పోలీసు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కమలానగర్**

ఆర్టీసీ ప్రాంగణం నిరుపయోగం

ఆత్మకూరు మండల కేంద్రంలో ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం నిరుపయోగంగా మారింది. అధికారులు గత 8 సంవత్సరాల నుంచి ప్రయాణ ప్రాంగణాన్ని ఉపయోగించలేదు. కనీసం మరమ్మతులు చేపట్టలేదు. యాచకులకు నిలయంగా మారింది. ప్రస్తుతం ఆవరణలో గుంతలు ఏర్పడి బురదతో నిండిపోయాయి. బస్సులు లోపలికి రాకుండా ప్రధాన రోడ్డుపై నుంచే వెళ్లిపోతున్నాయి. ప్రయాణికులు రోడ్డుపైనే నిరీక్షిస్తున్నారు.
- న్యూస్‌టుడే, ఆత్మకూరు



కనుమరుగుఅయ్యే దారేది?


వినాయకనగర్‌లో నిల్వ చేరిన మురుగునీరు

అశోక్‌నగర్(అనంత నగరపాలక), న్యూస్‌టుడే: అనంత నగరం ఏర్పాటై పాతిక ఏళ్లు అవుతోంది. జనాభా 4.36 లక్షలు. ఉమ్మడి జిల్లాల్లోనే ఎక్కువ మంది నివాసం ఉన్న ప్రాంతం. ఉపాధి, ఉద్యోగం, విద్య, వ్యాపారాల కోసం పలు ప్రాంతాల నుంచి ప్రజలు ఇక్కడికి వచ్చి స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. నేటికీ లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు తీరడం లేదు. చిన్న వర్షానికే మురుగు, వర్షంనీరు రోజుల తరబడి నిల్వ ఉంటున్నాయి. ఒకవైపు బురద.. మరోవైపు దుర్వాసనతో ఆ ప్రాంత వాసులు నరకం అనుభవిస్తున్నారు. తుపాను ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు అధ్వానంగా మారాయి.

ఆ ఆరు ప్రాంతాలు మినహాయిస్తే.. : జేఎన్‌టీయూ కళాశాల రోడ్డు, ఎస్‌బీఐ కాలనీ, శారదానగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, శ్రీనగర్ కాలనీ, సంగమిత్ర కాలనీల్లో మాత్రమే నీరు నిలబడవని నగరపాలక ఇంజినీరింగ్ విభాగం నివేదించింది. మరువ వంక, నడిమి వంక పరిసర ప్రాంతాల్లోని కాలనీల్లో వంక ఉద్ధృతికి నీరు ఆగుతాయి. రాంనగర్, సప్తగిరి కూడలి, వినాయకనగర్, యువజన కాలనీ, రజకనగర్, అంబేడ్కర్ నగర్, మున్నానగర్‌లో చిన్న వర్షానికే నీరు, మురుగు చేరుతుంది. గత 15ఏళ్లుగా భూగర్భ మురుగు కాలువ ప్రతిపాదనలకే పరిమితం అయ్యింది. కాలువ నిర్మాణానికి కనీసం రూ.400కోట్లు అవసరమని గతంలోనే ప్రతిపాదనలు సిద్ధం చేసినా కార్యరూపం దాల్చడం లేదు.


మూడో రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

జలమయం

అనంతపురం(కమలానగర్): నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. రెండు, మూడో రోడ్డు, కమలానగర్, గుల్జార్‌పేట తదితర ప్రాంతాల్లో రోడ్లపై గుంతల్లో నీరు నిల్వ చేరి వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు.

ఏపీజీఎల్ఐ సమస్యలు పరిష్కరించాలి

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల ఏపీజీఎల్ఐ సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ శ్రీసత్యసాయి జిల్లా శాఖ నాయకులు విజ్ఞప్తి చేశారు. అనంత జిల్లా పరిషత్తు కార్యాయంలోని ఏపీజీఎల్ఐ డిప్యూటీ డైరెక్టర్ భాస్కర్‌కి గురువారం వినతి పత్రం సమర్పించారు. మెచ్యూరిటీ బాండ్లు, రుణాలు తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, రవికుమార్, గోపాల్‌నాయక్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.